# రక్షణ సునాదము

"నీతిమంతుల గుడారములో రక్షణనుగూర్చిన
ఉత్సాహ సునాదము వినబడును"
దా॥కీర్తన. 118:15.

గ్రంథకర్త
యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2008 వెల.రూ/-15:00

Bible Mission HQ Guntur

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | | | పేజి నెం: |
|---|---|---|---|
| | త్రాణ (రక్షణ) | - | 1 |
| 1. | త్రాణోపాయ సంభాషణము (రక్షణ సంభాషణ) | - | 2 -11 |
| 2. | బైబిలు-దైవగ్రంథము | - | 12 -13 |
| 3. | దైవ స్థాపితమగు క్రైస్తవ మతము | - | 14 |
| 4. | క్రీస్తు మతముయొక్క కాలస్థాన నిర్ణయము | - | 15 -17 |
| 5. | అన్ని క్రైస్తవ మిషనుల ఐక్యత | - | 18 - 20 |
| 6. | ది బైబిలు మిషను | - | 21 - 25 |
| 7. | బైబిలుమిషనులోనికి సంఘస్తులుగా చేరగోరువారు | - | 26 - 27 |
| 8. | బైబిలు మిషను సిద్ధాంతములు | - | 28 - 35 |
| 9. | బైబిలు మిషను ఇతర విషయములు | - | 36 - 49 |
| 10. | బైబిలు మిషను ఆహ్వానము | - | 50 - 70 |

# త్రాణ (రక్షణ)

1. సర్వ మతస్థులకని ఉద్దేశించి, మోక్షప్రాప్తికి, అవసరమైనవి, దేవుడే స్వయముగా వ్రాయించి 1,150 భాషలలోనికి పైగా మార్పించిన బైబిలు అను గ్రంథమే సంపూర్ణ దైవగ్రంథము.

2. ఆ దేవుడే, దేవుడుగానేయుండక, కేవలము మనుష్యుడై అవతరించి మన నిమిత్తమై చేయవలసిన సమస్త కార్యములు చేసి పరలోకమునకు వెళ్ళి, మరల రానైయున్న శ్రీ యేసుక్రీస్తే సంపూర్ణ దైవ రక్షకుడు.

3. అందరి దేవుడే యేసుక్రీస్తుగా వచ్చి, నమ్మిన అందరి రక్షకుడగు యేసుక్రీస్తె క్రైస్తవ మతమును స్థాపించినాడు గనుక ఇదే సంపూర్ణ దైవ మతము.

4. అన్ని మతములను పిలుచుచు, సోదరభావము కలిగి, శరీరాత్మీయ జీవితోపకార్యములు చేయుచున్న ఇదే సంపూర్ణ దైవమతము. దైవప్రార్థన చేసి సత్యము తెలిసికొనుడి.

సీ॥ మతము సర్వజనుల మతముగాకున్నచో! మతమును మతము
సమ్మతముగాదు "పూర్తి రాగా సంసూప్తిపోవును" అను
బైబిలు వాక్కు శుభము గాదె దేవుండే పూర్తిగా దిగి వచ్చి
గలిసి పరీక్షించి! ప్రార్థింప సత్యంబు బయలు పడును.

గీ॥ సూర్యుడుదయింప చుక్కలజోలియేల! దైవతమునగన్పడ
ఈ మతంబు లేల అన్ని మతములొక్కమత మైనయెడల!
ఈ విదేశ స్వదేశాల యెగ్గుపోదె.

*ఈ పుస్తకములోని సద్విషయములు గ్రహించి, విశ్వసించి త్వరగా మేఘారూఢుడై రానైయున్న ప్రభుని ఎదుర్కొనండి.*

# 1. త్రాణోపాయ సంభాషణము
## (రక్షణ సంభాషణ)

**1.** *ప్రశ్న:-* లోకములు పుట్టకముందు ఏమి ఉండెనో!

*జవాబు:-* దేవుడొక్కడే, ఆయన సర్వ సద్గుణములతో ప్రకాశించు చుండెను.

**2.** *ప్రశ్న:-* ఆయన ఏమి చేయుచుండెనో!

*జవాబు:-* ముందుగా నరునికి కావలసిన దేవదూతలను, ఆకాశమును, భూలోకమును కలుగజేసి, తుదకు నరుని సృజించి, అతనికి రక్షణ మార్గము ఏర్పరుపవలెనను ఆలోచన గలవాడై యుండెను. **అప్పుడే ఆయన నిన్నెరుగును, నిన్ను ప్రేమించెను గనుక వెంటనే దేవుని స్తుతించుము.**

**3.** *ప్రశ్న:-* తర్వాత ఏమి చేసెను?

*జవాబు:-* కలుగచేయవలసినవన్నియు కలుగచేసి నరునియొద్దకు చేరుకొనెను. *ఉభయులకు గల మైత్రి మన ఊహకందనిది.*

**4.** *ప్రశ్న:-* తర్వాత ఏమి జరిగెను?

*జవాబు:-* అదివరకే దేవదూతలలో ఒకరు దేవునిలోనుండి వేరుపడి అనేకమందిని జట్టు చేసికొని, సైతానై నరులను దైవాతిక్రమకారులనుగా మార్చెను.

**5.** *ప్రశ్న:-* దేవుడెందుకు ఊరకుండెను?

*జవాబు:- జాగ్రత్త!* అని ముందే చెప్పియున్నందున *ఊరకుండెను.* నరునికి స్వతంత్రతనిచ్చెను గనుక అడ్డము వెళ్ళిన యెడల, అది ఇచ్చిన ప్రయోజనమేమి? సాతాను ప్రేరేపించినంత మాత్రమున నరులు దైవాజ్ఞను మీరుట ఏమియు బాగుగాలేదుగదా!

**6.** *ప్రశ్న:-* అప్పుడు దేవుడేమి చేసెను?

*జవాబు:-* వారిని క్షమించి, నరసంతతికి రక్షకుని పంపెదనని వాగ్దానమిచ్చెను.

**7.** *ప్రశ్న:*– తర్వాత ఏమి సంభవించెను?

*జవాబు:*– ప్రజలు పెరిగిరి, పాపములు పెరిగినవి. అందుచేత యూదులను దేవుడేర్పరచుకొని వారి పెద్దలగు వారికి (ప్రవక్తలద్వారా, రాజుల ద్వారా, సేవకుల ద్వారా మొ॥వారు) ప్రత్యక్షమగుచు, లోకమునకు బోధింపవలసినవి బోధించెను.

**8.** *ప్రశ్న:*– తర్వాత?

*జవాబు:*– నాలువేల ఏండ్లయిన తర్వాత లోకరక్షకుడు వాగ్ధాన ప్రకారము యూదులలో జన్మించెను.

**9.** *ప్రశ్న:*– ఆయన జన్మింపక ముందున్న వారి గతిఏమి?

*జవాబు:*– ఆయన వచ్చునని నమ్మినవారికి మోక్షమే.

**10.** *ప్రశ్న:*– ఆయన వచ్చి ఏమి చేసెను?

*జవాబు:*– తన యొద్దకు వచ్చువారికి మోక్షమని బోధించి, పాపులకు క్షమాపణను, మందులు లేకుండా రోగులకు స్వస్థతను అనుగ్రహించెను. నరులు భక్తిగా నడువవలసిన మార్గమును తన ప్రవర్తన మూలముగా కనబరచెను. కడకు దుష్టులాయనను గ్రహింపలేక కొరతవేసి (సిలువవేసి) చంపిరి. దానికే సిలువవేత అనిపేరు. ఆ సిలువమీద ఆయన నరులందరి పాపములు, వ్యాధులు, శిక్షలు తనమీద వేసికొనుటవల్ల తన ప్రేమను వెల్లడించెను. ఈలాగు చనిపోయి బ్రతికివచ్చి మోక్షమునకు వెళ్లెను. తాను మరలా వచెద్చనని ముందే తెల్పెను. ***ఆయనే యేసుక్రీస్తు ప్రభువు.***

**11.** *ప్రశ్న:*– అప్పుడు మందులులేకుండా బాగుచేసిన క్రీస్తు ఇప్పుడు ఎందుకు బాగుచేయకూడదు?

*జవాబు:*– బాగుచేయకేమి? మాలో కొందరు క్రీస్తు బోధ బోధించి, రోగులను చూచి– మీరు అన్ని పూజలు మానివేయండి. ఇకమీదట క్రీస్తునే పూజించండి. మీ శరీరమందున్న రక్షరేకులు మొదలైనవి తీసివేయండి. అప్పుడు మేము మీ వ్యాధి నివారణార్ధమై

ప్రార్థింతుము. బాగైనట్లు ముందే నమ్మివేయండి!' అని చెప్పి ప్రార్థించుచున్నారు. ***జబ్బులు బాగవుచున్నవి. దయ్యములు కూడ వదలిపోవుచున్నవి.***

**12.** *ప్రశ్న:*- నేను విన్నాను, మీరు క్రీస్తు దేవుడని నమ్ముదురుగదా?

*జవాబు:*- ఔను, దేవుడు నరావతారమెత్తి నియమిత రక్షకుడని అర్ధమిచ్చు యేసుక్రీస్తు అనుపేరు ధరించెను.

**13.** *ప్రశ్న:*- తర్వాత ఏమైనది?

*జవాబు:*- క్రీస్తు ప్రభువు దేవుడు గనుకనే పవిత్ర జీవనమును ప్రదర్శించి, చనిపోయినను మూడవనాడు బ్రతికివచ్చి, పరలోకమునకు వెళ్లిన పిమ్మట ఆయననుబట్టి క్రైస్తవమతమేర్పడినది.

**14.** ఇది యూరోపియనుల మతముగదా?

*జవాబు:*- అయినను ఇది ఒక దేశమతము కాదు గాన, సర్వలోకమునకు ఈ మతము బోధించుడని క్రీస్తు చెప్పెను. ***సర్వజనుల నిమిత్తమై దేవుడేర్పరచిన మతము, నరకల్పితముకాదు,*** గనుక సర్వలోక మతము, ఒక దేశమతము కాదు.

**15.** *ప్రశ్న:*- ఆయన మరలా వచ్చుట నిజమని ఎట్లు చెప్పగలము?

*జవాబు:*- ఆయన వచ్చుననగా యూదులు పాలస్తీనా వెళ్ళుదురనియు; బస్సులు, కారులు తిరుగుననియు, ఉద్యోగములు, కూలి దొరకని దినములు వచ్చుననియు బైబిలులోనున్నది. ఇవి నేడు నెరవేరు చున్నవిగదా! గనుక ఆయన వచ్చువేళ అయినది.

**16.** ఆయన వచ్చి ఏమి చేయును?

*జవాబు:*- ఆయన మహిమ మేఘముమీదవచ్చి ఇదివరకు ఆయనయందు మరణించిన మృతులను, ఆయన రాకను నమ్ముచు

Bible Mission HQ Guntur

సిద్ధపడుచున్న సజీవులను మోక్షమునకు కొంచుపోవును. ఆ మృతులను బ్రతికించి ఆకర్షించుకొనును. సజీవులకు చావులేకుండా మహిమ శరీరము ధరింపజేసి మేఘములోనికి ఆకర్షించుకొనును. ***శిశువులు పాపముచేయరు గనుక ప్రభువు వారిని కూడ కొంచుపోవును. ఎవరి (ఏ మతమువారైన) శిశువులైనను సరే.***

**17.** *ప్రశ్న:*- ఏమి చేయునెడల రాకడలో పాలుండును? (లేక) ఏ కార్యములు చేసిన రాకడలో క్రీస్తుతో వెళ్ళగలము?

*జవాబు:*- తప్పు అని తెలిసిన ప్రతిదియు విసర్జింపవలెను. *గుర్తులనుబట్టి ఆయన రాకడ మనకాలమందే త్వరగా నెరవేరునని* నమ్మవలెను. ఆయన రాకడకొరకు ఆశించుచు ధ్యానించుచుండవలెను. పాదిరిగారు నీళ్లతో ఇచ్చు బాప్తిస్మము పొందువారు సైతము, క్రీస్తు ఇచ్చు పరిశుద్ధాత్మ బాప్తిస్మముకూడ పొందవలెను. ఇది నమ్ముటవలననే పొందగలరు. రాకడకు సిద్ధము కావలెనని దేవుడిది ఈ కాలములో అనేకులకు ఇచ్చుచున్నాడు. (నీళ్ళుగల బాప్తిస్మము ఆత్మీయజీవనము యొక్క జన్మమునకు సంబంధించినది. *పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఆ జీవనముయొక్క వృద్ధికిని, సేవకవసరమైన శక్తికిని సంబంధించినది).*

**18.** *ప్రశ్న:*- ఆయనను నమ్మినవారు ఆయనతో వెళ్ళిపోగా నమ్మక భూమిమీద మిగిలిపోయిన వారిమాటేమిటి?

*జవాబు:*- వెంటనే అంతెక్రీస్తు అను క్రీస్తు విరోధి, భూమిని ఏడేండ్లు ఏలును. ఇంకను క్రీస్తు నామముగల వారిని హింసించును. అయితే, ఆ హింసకాలములో అనేకులు దైవభక్తులగుదురు. వారిని మాత్రమే క్రీస్తు రక్షించి మోక్షములో వేరొకచోట బెట్టును.

**19.** *ప్రశ్న:*- తర్వాత?

*జవాబు:*- ఏడేండ్ల చివర పాలస్తీనాలోని హర్మగెద్దోనువద్ద క్రీస్తునకును, అంతెక్రీస్తునకును యుద్ధము జరుగును. అప్పుడు క్రీస్తు

ప్రభువు అంతెక్రీస్తును, అతని సహాయకులగు అబద్ధప్రవక్తను, దయ్యములను అగ్నిగుండములో పడవేయును. ఇది నిత్యనరకాగ్ని వారి రాజగు సాతానును వెయ్యేండ్లు చెరసాలలో బంధించును.

**20.** *ప్రశ్న:–* ఆ తరువాత?

*జవాబు:–* క్రీస్తును, ఆయనతో మొదట వెళ్ళిన భక్తులును, శుద్ధీకరింపబడిన ఈ భూమిమీదికి వచ్చి శాంతిపరిపాలన చేయుదురు. అది ***మహానందకాలము, శాంతికాలము, సమృద్ధికాలము, నిశ్చింత కాలము.*** మనకు తెలిసిన ఏ కష్టమును ఉండదు. భక్తిహీనులకు క్రీస్తు మతబోధ పూర్తిగా వినబడును. ***ఇప్పుడు ప్రతి దేశమునకును ప్రకటింప బడుచున్నది. గాని అప్పుడు ప్రతి మనుష్యునికి ప్రకటింపబడును.***

**21.** *ప్రశ్న:–* ఆ తరువాత?

*జవాబు:–* ఆ బోధ విన్నవారిలో ఎందరు భక్తులైనారో, అది వినిపించుటకు క్రీస్తు ఈ భూమిమీద తీర్పు దినమొకటి నియమించును. దీనికే సజీవుల తీర్పు అని పేరు.

**22.** *ప్రశ్న:–* ఆ తరవాత?

*జవాబు:–* అదివరకు చెరలోనున్న సైతానుకు క్రీస్తు విడుదల కలుగచేయును. అప్పుడతడు ఈ భూమిమీదకి వచ్చి తన పక్షముగానున్న వారిని ఒక సైన్యముగా సమకూర్చుకొని, క్రీస్తుమీదికి యుద్ధమునకు వెళ్ళును. గాని ఓడిపోవును. మోక్షలోకమునుండి అగ్నికురిసి ఆ సైన్యమును దహించి వేయును. అయితే క్రీస్తు వెంటనే సైతానును పట్టుకొని నిత్యాగ్ని గుండములో పడవేయును. అక్కడ అతడును, అతనివారును నిత్యబాధ నొందుదురు.

**23.** *ప్రశ్న:–* ఆ తరువాత?

*జవాబు:–* భూమి పుట్టినది మొదలు అప్పటివరకున్న అవిశ్వాసులను క్రీస్తు బ్రతికించి వారికి తీర్పు వినిపించును. ***దీనికే రెండవ పునరుత్థానము, అంత్య తీర్పు అని పేర్లు.***

**24.** *ప్రశ్న:–* ఇవన్నియు ఎక్కడ ఉన్నవి?

*జవాబు:–* బైబిలులోను, అందున్న ప్రకటన పుస్తకములోను ఉన్నవి.

**25.** *ప్రశ్న:–* ఇంత చెప్పుకొని వచ్చినారు, క్రైస్తవ మత చరిత్ర నాకు తెలిసిపోయినది. ఒక్కమాటలో చెప్పకూడదా?

*జవాబు:–* చెప్పగలను. ***యేసుక్రీస్తుగా ప్రత్యక్షమైన దేవునిని అన్నిటిలోను నమ్ముకొనండి.*** అప్పుడు మోక్షము.

**26.** *ప్రశ్న:–* అన్ని మతములు అన్ని విధములుగా చెప్పుచున్నవి. ఒక మతములోనే ఒకరొకరీతిగాను, ఇంకొకరొక రీతిగాను చెప్పుదురు. సత్యము తెలిసికొనుట ఎట్లు?

*జవాబు:–* 1. దేవుడు ప్రతివారికి మనస్సాక్షిని, జ్ఞానమును ఇచ్చినాడు. వాటినిబట్టి గ్రహించుకొనవలెను. 2. సర్వలోక సృష్టినిబట్టి దేవుని ప్రేమను, శక్తిని తెలిసికొనవచ్చును. 3. మనస్సాక్షి పాపమువలన మందగిలినందువలన సత్యమును పూర్తిగా చెప్పనేరదు. గనుక దేవుడు బైబిలను గ్రంథము నొకదానిని వ్రాయించినాడు. అది చదివి సంగతులు తెలిసికొనవచ్చును. బైబిలు తెలియని వారికి మనస్సాక్షినిబట్టి దేవుడు తీర్పు వినిపించును.

**27.** *ప్రశ్న:–* దేవుని నమ్మనివారు వెంటనే నరకమునకు వెళ్ళుదురా?

*జవాబు:–* వెళ్ళరు. ముందు పాతాళలోకమునకు వెళ్ళుదురు. అక్కడ పరలోక భక్తులును, దూతలును క్రీస్తును గురించి బోధింతురు. ***ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు క్రీస్తును గురించి వినినిదే ఎవరును నరకమునకుగాని, మోక్షమునకుగాని వెళ్లరు.*** దేవుడు అన్యాయస్థుడుకాడు. నరుడు మారుటకు భూలోకమే మెరుగు. మరణ సమయమునకూడ దేవదూతలు, పరలోక భక్తులు బోధింతురు.

**28.** కులమును గురించి మీ అభిప్రాయమేమి?

*జవాబు:* – పాపము మన ఆది తల్లిదండ్రులలో ప్రవేశించిననాడే దీనిమొదలు మొదలు పెట్టినది. ఏలాగనిన: మొదట స్త్రీ దైవాజ్ఞ మీరెను. ఆ తర్వాత ఆమె బోధవలన పురుషుడు మీరెను. అందువలన కలిగిన వివాదమువల్ల ఇద్దరికి ఒకవిధమైన యెడబాటు కలిగినది. ఈ ఎడబాటే వారి సంతతిలోను కలిగెను. అనగా మనుష్యులలో మనుష్యులకు ఎడబాపు వచ్చెను. ***తుదకిదే మన దేశములో కులముగా మారినది.***

**29.** *ప్రశ్న:* – విగ్రహారాధనను గురించి మీ అభిప్రాయమేమి?

*జవాబు:* – దీనిమొదలు కూడ ఆ మొదలువద్దనే మొదలు పెట్టినది. ఏలాగనిన, అదివరకు పాపము లేనప్పుడు కనబడిన దేవుడు, పాప ప్రవేశానంతరమున కనబడేవీలులేకపోయెను. గనుక నరులు కంటికి కనబడుచున్న సృష్టిని మ్రొక్కనారంభించిరి.

**30.** *ప్రశ్న:* – వేదపారాయణమువల్ల, ఉపవాసమువల్ల, ధర్మకార్యముల వల్ల, గుళ్ళు మరియు సత్రములు కట్టించుటవల్ల, మనకు మనమే శిక్ష కల్పించుకొనుట వల్ల, మనమెవరి విషయములో అపరాధులమో వారియొద్దకు వెళ్లి మన అపరాధము లొప్పుకొనుటవల్ల, మతోపదేశ స్థానములు దర్శించుటవల్ల; పాపపరిహారము, ముక్తి కలుగునని చెప్పుదురు! మీరేమందురు?

*జవాబు:* – ఇవన్నియు మంచి పనులేగాని వీనివల్ల ముక్తి దొరకదు. ***క్రీస్తు మన నిమిత్తమై ఏమి చేసెనో, అది నమ్మటవల్లనే మనకు ముక్తి, పాపపరిహారము.*** ముక్తిమార్గము దొరికిన తర్వాత ఆ సంతోషముచేత సత్క్రియలు చేసిన యెడల, అట్టివి దేవునికి అంగీకారమే గాని అప్పుడైన వాటివల్ల రక్షణరాదు. అదివరకే వచ్చివేసినది గదా!

**31.** *ప్రశ్న:* – మీరు చెప్పిన విషయములు తెలిసినవి గాని, అవి సరియని నాకింకను తోచుటలేదు.

*జవాబు:*– అందుచేతనే దేవుని ప్రార్థించండి. సమస్తమును పరిష్కారమగును. మీకు శుభము కలుగును గాక.

**32.** *ప్రశ్న:*– ప్రార్థించిన యెడల దేవుడు చెప్పునా ఏమి?

*జవాబు:*– చెప్పును, చెప్పును. చెప్పని పక్షమున నమ్మిక కలిగించును. మీ జ్ఞానమునకు అర్థమగునట్లు చేయును. నిజము తెలిసికొనవలెననే శ్రద్ధ మీకున్నయెడల, ఆయన ఏదో ఒక విధముగ తెలియజేయకుండ ఉండలేడు.

**33.** ప్రశ్న:– మోక్షము దొరుకు విధమేమి? చెప్పగలరా?

*జవాబు:*– చెప్పితిని గదా! మరలా చెప్పుదును. 1. మొదట బైబిలులోని బోధ పూర్తిగా వినండి. 2. పిదప మీ పాపములను గురించి దుఃఖించండి. 3. ఆ పిదప పాపములు క్షమించుమని దేవుని వేడుకొనండి. 4. తర్వాత 'ఇకమీదట పాపము చేయను' అని దేవుని యెదుట ప్రమాణము చేయండి. 5. ఆ తర్వాత మీ పాపములు పరిహారమైనవని నమ్మి, ఆ నమ్మిక వల్ల క్షమాపణ పొంది దేవుని స్తుతించండి. 6. అప్పుడు మీ జీవితము మార్పు పొందిన జీవితమగును. పిమ్మట ఆ జీవితము వృద్ధియగుటకు అనుదినము బైబిలు చదువుచు, ప్రార్థన చేసికొనుచు, మీకు తెలిసిన దైవ విషయములు ఎవరికైన ఒకరికి బోధించుచు ఉండండి. ***క్రీస్తే నా సర్వమని నమ్మండి. అప్పుడు మీకు మోక్షము.***

**34.** *ప్రశ్న:*– ప్రమాణము చేసినను, పాపము మరల నన్ను లొంగదీయును. ఏమి చేయవలెను?

*జవాబు:*– పాపమును మీరే లొంగదీయు శక్తి, క్రీస్తు ప్రభువు వలన లభించును. మీకు క్షమాపణయే కాదు పాపములను జయించు శక్తి కూడ లభించును.

**35.** అనేక మతములు, ఆ మతములలో అనేక శాఖలు, అనేకాభిప్రాయములు; మంచివారిలోనే కొన్ని లోపములు

కనబడుచున్నవి. లోకమంతయు మాయతో నిండియున్నది. ఏది నమ్మవలెను? ఎవరిని నమ్మవలెను? మనసును నమ్ముటకు మొదలే వీలుపడదు. ఒకప్పుడు సంతోషము. ఇంకొకప్పుడు భీతి. మరొకప్పుడు పరిపూర్ణ విశ్వాసము. అంతలోనే అపనమ్మిక!!

*జవాబు:–* మనుష్యులను, అభిప్రాయములను, ఆశ్రయింపవద్దు. **బైబిలును, దానియందు వర్ణింపబడిన క్రీస్తుప్రభువును చూడండి.** అప్పుడు మీకు శాంతి.

**36.** *ప్రశ్న:–* సరే నాకు స్థిరమైన నమ్మకము పుట్టవలసినప్పుడే పుట్టును. అప్పటివరకును ఊరకుందును?

*జవాబు:–* వల్లపడదు. ఇప్పుడే నిశ్చయించుకొనండి. ఇప్పుడే ప్రార్థించండి. ఇప్పుడే నమ్మండి. ఇప్పుడే స్తుతించండి. ఇప్పుడే పొందండి.

**37.** *ప్రశ్న:–* చాలా కష్టమైన పని పెట్టినారు. ఇప్పుడు కుదరదు!

*జవాబు:–* మీ శక్తిమీద, మీ జ్ఞానముమీద ఆనుకొన్నయెడల కుదరదు. 'నేను ప్రార్థించుట ఆరంభించినట్లయిన క్రీస్తు ప్రభువే తక్కినదంతయును చూచుకొనును' అని అనుకొని ఆరంభించండి. అప్పుడు తొలగవలసినవన్నియు తొలగును. కలుగవలసిన శాంతి కలుగును.

**38.** *ప్రశ్న:–* 'అన్ని మతములు ఒకటే. తుదకన్నియును మోక్షమునకే దారితీయును' అని పెద్దలు చెప్పుచున్నారు.

*జవాబు:–* క్రైస్తవమతము ప్రకటన మతము. అనగా అన్ని మతములను తనలోనికి పిలుచుకొనుచున్నది. ఈ పని తక్కిన మతములలోలేదు గనుక అన్నియు ఒకటి కానేరవు. కొన్ని క్రైస్తవ మతపద్ధతులు, అన్ని మతములు కొంతవరకు అవలంభించినంత మాత్రమున, అన్ని మతములు క్రీస్తు మతము కాజాలవు. **క్రీస్తు మతము అన్ని మతములుగా తేలదు.** అన్ని మతములును ఒకటే అయితే ఒక మతమును మరొక మతము తరిమివేయజూచుట ఎందుకు?

*జవాబు:*– సాధు సుందర్ సింగ్ అను హిందూదేశ క్రైస్తవమత ప్రచారకుడు– 'మీకు క్రీస్తు లేడు, ఇదే మీకు మాకు తేడా! ఎందరుంటే ఏమి ఉపయోగము? క్రీస్తు లేనప్పుడు!' అని అన్యమతస్థులకు చెప్పియున్నాడు.

**39.** *ప్రశ్న:*– దైవమతమని చెప్పుకునే మీ మతములో దుర్జనులు లేరా?

*జవాబు:*– ఉన్నారు. ***క్రీస్తుమతము– క్రీస్తు శిష్యులను బట్టి స్థాపించినది కాదు.*** క్రీస్తును బట్టి, ఆయన పావన చరిత్రను బట్టి, ఆయన దివ్యైక బోధలను బట్టి, దైవగ్రంథమగు బైబిలునుబట్టి స్థాపించబడినది వాటినే అనుసరించునది.

**40.** *ప్రశ్న:*– అవిశ్వాసుల అంత్య తీర్పు తర్వాత ఏమి జరుగును?

*జవాబు:*– ముందు తీర్పు సంగతి చెప్పవలెను. 'అయ్యా! మేము నీ నామమున అద్భుతకార్యములు చేయలేదా?' అని కొందరు క్రీస్తును అడుగుదురు. 'మీరెవరో నేనెరుగను' అని ఆయన ఉత్తరమిచ్చును.

**41.** *ప్రశ్న:*– ఆ తర్వాత

*జవాబు:*– రక్షింపబడినవారు నూతన యెరూషలేములో కొందరు, మోక్షములో కొందరు, రక్షితుల మోక్షములో కొందరు, భూలోక మోక్షములో కొందరు, అనంత కాలము నివసింతురు. ***వారి వారి విశ్వాసమును బట్టియు, విశ్వాసము వల్ల గడించుకొన్న మహిమ స్థితిని బట్టియు యేసుక్రీస్తు ప్రభువు ఈ మూడు లోకములలో ప్రత్యక్ష మగుచుండును.*** అదే నిత్యానంద భాగ్యము! భూమి క్రొత్తభూమియై, మోక్షములో నొక భాగముగా నుండును. ***తండ్రి రక్తము కుమారుని కుందునట్లు, క్రీస్తు రక్తము భక్తులకుండును గనుక స్తుతిగల సుఖ జీవనము కలుగును.***

Bible Mission HQ Guntur

# 2. బైబిలు - దైవ గ్రంథము

బైబిలు:- 1. దేవుని ప్రేరేపణవలన వ్రాయబడినది గనుక బైబిలు దైవగ్రంథము. 2. బైబిలు:- సర్వజనుల నిమిత్తమై ఉద్దేశింపబడినది గనుక బైబిలు దైవగ్రంథము. 3. బైబిలు:- నేటికి 2000 భాషలలో అచ్చువేయబడి లోకమంతటికి ఉపయోగ గ్రంథముగా నున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 4. బైబిలు:- లోకములోనున్న చెడుగును, మంచిని చూపించుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 5. బైబిలు:- దుర్జనుల పాపములను మాత్రమేకాక, పక్షపాతము లేకుండ భక్తుల పాపములను కూడ పేర్కొను చున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 6. బైబిలు:- అనాది ఏర్పాటు మొదలుకొని అనంతము వరకు దేవుడు మానవులకు చేయతలచిన విషయములు కనపరచుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 7. బైబిలు:- నరుల నిమిత్తమై వారి జన్మమునకు పూర్వమే కాపుకర్తలగు దేవదూతలను, వెలుగునకు కారణమగు ఆకాశమును, నివాసమునకు అవసరమైన భూమిని దేవుడు కలుగజేసినట్లు స్పష్టపరచుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 8. బైబిలు:- దేవుడే స్వయముగా మానవుల రక్షణార్థమై నరావతార పురుషుడుగా జన్మించి, మానవునికి చేయవలసిన అన్ని పనులు చేసెనని చెప్పుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 9. బైబిలు:- యేసు అనగా రక్షకుడనియు, క్రీస్తు అనగా రక్షకులని చెప్పుకొను వారందరికంటె మించిన ఏర్పాటు రక్షకుడనియు అర్థముగల యేసుక్రీస్తు నామమును, ఆ అవతార పురుషుడు ధరించుకొనెనని అగుపరచుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 10. బైబిలు:- క్రైస్తవ మత సంఘము ఆ పురుషుని నామమును బట్టి స్థాపించబడినదని తెలుపుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 11. బైబిలు:- క్రైస్తవమతము సర్వజనుల మతమగుటచేత అన్ని మతములలోని వారిని పిలుచుచు

సత్కరించుచున్నదని విశదపరచుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 12. బైబిలును, దీనిలోని మతమును నిరర్ధకము చేయుటకై, అర్ధముకానివారి వలన చిరకాలమునుండి అనేక ప్రయత్నములు జరుగుచున్నను, ఈ రెండును నిలువబడి యున్నవి గనుక బైబిలు దైవగ్రంథము. 13. బైబిలు:- గతకాల వృత్తాంతములు మాత్రమేకాక భావికాల వృత్తాంతములుకూడ ప్రకటించుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 14. బైబిలు:- మానవుల ఊహకు తోచని విషయములు ఉదహరించుచున్నది గనుక బైబిలు దైవగ్రంథము. 15. బైబిలు:- ప్రవచనముల నెరవేర్పునకు కారణమైయున్నది. గనుక బైబిలు దైవగ్రంథము.

దైవ గ్రంథమగు బైబిలును, దైవావతారమగు క్రీస్తును, దైవమతమగు క్రైస్తవ సంఘమును; ఈ మూడు ఉపకార సాధనములు మాకు అక్కరలేదని కొందరు చెప్పుచున్నారు. అయితే బైబిలు అందరికొరకు ఉద్దేశించబడినది గనుక బైబిలు అందరి గ్రంథము.

**బైబిలుయొక్క సర్వవ్యాపకత్వము:-**

దేవుడు సర్వవ్యాపి గనుక బైబిలునకుకూడ సర్వవ్యాపకత్వము వచ్చినది. *ఎట్లనగా బైబిలు అన్ని దేశములలోనికిని, అన్ని భాషలలోనికిని, అన్ని మతములలోనికిని, అన్ని జనాంగములలోనికిని, అన్ని కాలముల లోనికిని ప్రవేశించుచున్నది.* ***లోకాంతమువరకును వెళ్ళునట్టి ధోరణి కలిగియున్నది.*** బైబిలులోని ముఖ్య కథానాయకుడగు క్రీస్తు మోక్షములో నుండును గనుకను, బైబిలు విషయముల ప్రమేయముకూడ ఆయనతో నుండును గనుకను బైబిలు అనంత కాలమువరకు వెళ్ళుచూనే యుండును.

2. కాకాని స్వస్థిశాలలో బైబిలులోని మార్కు సువార్త 5వ అధ్యాయము చదువునపుడు భూత పీడితులకు విముక్తి కలుగుచున్నది. ప్రతి ఇంటిలో బైబిలు ప్రతి యొక్కరికి యొకటి ఉంచుకొనుట క్షేమము.

# 3. దైవ స్థాపితమగు క్రైస్తవమతము

క్రైస్తవ దేశములు సర్వలోకమునకు చేయుచున్న ఉపకార సాధనములు ఏవనిన:

1) పుస్తకములు అచ్చువేయు ముద్రాక్షరశాలలు,

2) గ్యాసులైట్లు, మెరుపుదీపములు,

3) ట్రైన్లు, కారులు, బస్సులు, సైకిళ్ళు, విమానములు, రోధనలోనికి వెళ్ళు రాకెట్‌లు స్టీమర్లు;

4) అన్ని విధములైన మరలు, 5) కాలేజిలు,

6) వైద్యశాలలు, 7) దుర్భిణీలు,

8) టెలిగ్రాంలు, 9) టెలిఫోనులు,

10) గ్రాంఫోనులు, 11) రేడియోలు,

12) బ్రాడ్‌క్యాస్టులు, 13) ఫోటోగ్రాపులు,

14) మ్యాజిక్ లాంతర్లు,

15) సినిమాలు, 16) టెలివిజన్లు,

17) కండ్ల అద్దములు,

18) ఎక్సరేలు, 19) గడియారములు, కంప్యూటర్‌లు

20) అనాధశాలలు, 21) గ్రుడ్డివారి పాఠశాలలు,

22) టైపు రైటింగు మిషనులు, 24) బట్టలుకుట్టు మిషనులు మొదలైనవి.

ఇవి పూర్వకాలమందు ఉండినవే అని నిశ్చయత తెలిసినవారు అన్నయెడల అవి ఇప్పుడు లేవుగదా! కాని ఇవి ఇప్పుడు ఉన్నవి, ఇవి వాడుకొనుచున్నాము అని జవాబు చెప్పుదుము.

# 4. క్రీస్తు మతముయొక్క కాలస్థాన నిర్ణయము

**ఎ) అనాది మతము:-** క్రీస్తు భూమిమీద అవతరించుననియు, క్రైస్తవమత స్థాపన జరుగుననియు, లోకములు పుట్టకముందు అనాదియందే దేవుని ఆలోచనలో నుండెను గనుక క్రీస్తుమతము అనాది మతము. (ఎఫెసీ 1:6; 1పేతురు 1:26).

**బి) ఆది మతము:-** ***లోకములు పుట్టిన తరువాత పాపప్రవేశ కాలమందు క్రీస్తు రక్షకుని రాకడ ప్రకటింపబడెను. కనుక అది*** **ఆదిమతము** (ఆ.కా. 3:15; 12:3-4).

**సి) ప్రత్యక్ష మతము:-** క్రీస్తు ప్రత్యక్షము కాగా మతస్థాపన అయినది. కనుక అది మొదటి శతాబ్దకాల ప్రత్యక్షమతము.

**డి) అందరి మతము (సర్వలోకమతము):-** (లూకా 2వ అధ్యా॥, అపో.కార్య. 15వ అధ్యా॥) ఇప్పటికి 20 వందల ఏండ్లు అయినది. క్రీస్తు శకకాలపు తేదీలుకూడ అన్ని మతములవారు వాడుచున్నారు (ఉదా: క్రీ.శ.1957). సర్వలోకమునకు తన విషయములు బోధింపవలెనని క్రీస్తు చెప్పినందువలన క్రైస్తవులు లోకమంతయు సంచరించి బోధించుచున్నారు. కనుక అది సర్వ లోకమతము, అందరి మతము. (మత్తయి 28:18-19; మార్కు 16:15; లూకా 24:47; అపో॥కార్య. 1:8).

**ఇ) అన్ని భాషల మతము:-** క్రీస్తు మతముయొక్క దైవగ్రంథమగు బైబిలు 2000 పై చిలుకు భాషలలో అచ్చువేయబడినది. గనుక అది అన్ని భాషల మతము.

**ఎఫ్) స్వదేశ మతము (సర్వదేశముల మతము):-** దేవుడగు క్రీస్తు మనదేశమునకు పరదేశమగు పాలెస్తీనాలో జన్మించినంత మాత్రమున, అది పరదేశ మతముకాదు. దేశములును, జనములును లేకముందే అది అన్ని దేశములకు ఏర్పాటైనది. ***గనుక క్రీస్తు మతము ప్రతి దేశమునకు స్వదేశమతమై యున్నది.*** క్రీస్తు దేవుడని బైబిలు

చెప్పుచున్నది కనుక అది దైవమతము. అది దైవమతము గనుక మన అందరిమతము (యెషయా 9:6; ఫిలిప్పీ 2అధ్యా॥).

**జి) నిరీక్షణ మతము:-** ఎ న్ని అడ్డులు వచ్చినను ఆగకుండా, అది మనకాలమువరకు వచ్చినది కనుక అది నిరీక్షణమతము. క్రీస్తు వచ్చువరకు అది నిరీక్షించినవారి మతము కనుక అది నిరీక్షణమతము.

**హెచ్) అనంత మతము:-** 'నేడుమొదలుకొని లోకాంతము వరకు నిశ్చయముగా సాగుచూ వెళ్ళును' అను దైవప్రవచనముకలదు గనుక అది లోకాంతమువరకు సాగునట్టి మతము. తరువాత పరలోకమునకు చేరి అనంతమువరకు యుగయుగముల పొడుగున సాగుచూనేయుండును కనుక అది అనంత మతము. "అనాది మతము", అనంత మతము ఇదే అని బైబిలు చూపుచున్నది. నమ్మగలవారు మహా ధన్యులు. మోక్షలోకములో *దానికి* ***మతము*** అను పేరు *ఉండదు. గాని* ***నిత్య జీవము*** అను పేరుండును. ఈ క్రైస్తవ మతము అన్ని మతములలోని వారిని తనలోనికి చేర్చుకొనుచున్నది. కనుక అది అన్ని మతములకు ఆహ్వానమతము. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా! నా యొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతును- నాయొద్ద నేర్చుకొనుడి'' అనియు (మత్తయి 11:28-29), "నాయొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయను" అనియు (యోహాను 6:37) క్రీస్తు ప్రభువు' చెప్పెను. కనుక అది సమస్తమైన వారికిని, వారిలో ప్రతివారికిని పంపబడిన ఆహ్వానమతము. ఇన్ని మతములు, ఇన్ని మిషనులు *ఉండగా* దేవుడు బైబిలు *మిషనును ఎందుకు బయలుపరచెనో!* అను అంశమును లోకము ఆలోచనలోనికి తేవలసి ఉన్నది. 1938లో బైలుపడిన ఈ మిషనుద్వారా ఏదో ఒక క్రొత్త వర్తమానము తెలియవలసియున్నది.

బైబిలులోని అద్భుతములు, వరములు; అక్కరలనుబట్టి నేటికాలమందు కూడ వాడుకలో కనబడవలసియున్నవి. **ఆనాడు ప్రత్యక్షమైన దేవుడు ఇప్పుడును ప్రార్థించిన యెడల ప్రత్యక్షమగును.**

క్రీస్తుప్రభువు సైతానును, భూతములను, పాపములను, వాటివల్ల కలుగు దుష్ట ఫలితములను, తుదకు సిలువమ్రానుమీద కలిగిన ఘోరమరణమును, సమాధిని గెలిచెను. **కనుక అన్ని కష్టములలోనుండి మనకు ఆయన విడుదల కలిగింపగలడు.** ఏవి విసర్జింపవలెనో, ఏవి అంగీకరింపవలెనో! అవి ఆయన బోధించి నడచి చూపెను. ఆయన చేయలేని మేలు ఉండదు, తొలగింపలేని కీడు ఉండదు. జీవాంతమందు క్రీస్తు విశ్వాసులను మోక్షమునకు తీసికొని వెళ్ళును.

మన దేవుడు మిమ్మును, మీ కుటుంబములను, మీ బంధువులను, మీ స్నేహితులను, మీ అధికారులను, మీ ఉపకారులను, మీ పగవారిని, మీ పొలములను, మీ ఆస్థిని, మీ శరీరములను, మీ పారమార్థిక జీవనమును, మీ పశ్వాదులను నిత్యము దీవించుచుండును గాక! ఆమేన్.

**అనంతకాల ప్రతినిధి:**

**త్రిత్వవ్యక్తులు:–** తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అనువారు; ముగ్గురు ముగ్గురుగాను, ముగ్గురు ఒక్కరుగాను ప్రత్యక్షమైరి. అగ్నిజ్వాలలో వేడి, వెలుగు, ఆకృతి ఉండును. మూడు, ఒకటేనా? వెలుగును తీసివేసిన యెడల తక్కిన రెండును అంతరించును. అట్లే ఏ ఒక్క దానిని తీసివేసినను తక్కిన రెండును పోవును గనుక వేరుచేయలేము. దైవత్రిత్వమును ఇట్టిదే. ఈ దైవత్రిత్వ సభలో మానవులమైన మన ప్రతినిధిగలడు. ఇది భక్త జన సంతోషాతిశయమై యున్నది. ఆ ప్రతినిధి క్రీస్తే.

# 5. అన్ని క్రైస్తవ మిషనుల ఐక్యత

**"సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!" దావీదు కీర్తనలు 133:1.**

1. ప్రభువునందు ప్రియులారా! మన మతము అనేకమైన మిషను శాఖలుగా ఏర్పడినందున, ఇది దైవమతమైన యెడల ఇన్ని చీలికలు ఎందుకు రావలెనని ఇతరులు ఆక్షేపించుచున్నారు. మన మతములోనికి రాగోరువారిలో కొందరు, ఏ మిషనులోనికి వెళ్ళవలెను? అని ప్రశ్నించుచు, ఇతర మతములలోనికి వెళ్ళిపోవుచున్నారు. దేశ క్షేమార్ధమై పనిచేసి చేసి, ఈ మధ్యనే మరణించిన అంబేద్కర్ గారు బౌద్ధమతములోనికి వెళ్ళిపోయిరి. ఆ తర్వాత ఇతరులనేకులును, పదిహేను వందలమంది క్రైస్తవులునుకూడ ఆయనతోపాటు బౌద్ధమతము లోనికి వెళ్ళిపోయిరి. వారు మనలోనికి రాకుండుటకు మిషనుల భేదములే కారణము.

2. చిన్నపిల్లలకు బాప్తిస్మ మియ్యకూడదని కొందరు, ఇచ్చి తీరవలయునని కొందరు, ముంచి ఇచ్చుటయే సరియైన బాప్తిస్మ పద్ధతి అని కొందరు, ఏ పద్ధతియైన ఒకటే అని కొందరు, సంస్కార భోజనములో రొట్టె ఇచ్చిన చాలునని కొందరు, రొట్టెయును, ద్రాక్షారసమును ఇచ్చుట క్రీస్తుప్రభువుయొక్క ఆచారము గనుక రెండును ఈయవలెనని కొందరు, బాప్తిస్మమును, సంస్కార భోజనమును ఈ రెండును అవసరములేదని కొందరు, అవసరమని కొందరు, చిన్నప్పుడు బాప్తిస్మము పొందినవారు పెద్దప్పుడు మరలా బాప్తిస్మము పొందవలెనని

కొందరు, కూడదని కొందరు, మందులు వేసికొనకూడదని కొందరు, ప్రార్థనచేసి వేసికొనవచ్చునని కొందరు, నగలు వేసికొనకూడదని కొందరు, వేసికొనవచ్చునని కొందరు, స్త్రీలు సంఘములో మాటలాడకూడదని కొందరు, స్త్రీలవల్లనే నేడు సువార్తపని ఎక్కువగా జరుగుచున్నది గనుక మాటలాడవచ్చునని కొందరు, ప్రభువు నేర్పిన ప్రార్థన చేయకూడదని కొందరు, చేయవలెనని కొందరు, 7వ దినమున సబ్బాతు ఆచరింపవలెనని కొందరు, ఆచరింపకూడదు గాని ఆదివారము ఆచరింపవలెనని కొందరు, రెండవరాకడ జరుగదని కొందరు; జరుగుననియు, నమ్మని వారు మిగిలిపోయి హింసల పాలగుదురనియు కొందరు, ***ఈ కాలమందుకూడ క్రీస్తు ప్రభువు దర్శనమందు కనబడునని కొందరు,*** కనబడదని కొందరు, బైబిలులోని అద్భుతములు నేడును అవసరమునుబట్టి జరుగునని కొందరు, జరుగవని కొందరు, క్రీస్తు ఒక్కసారే వచ్చి, అందరికి ఒక్కసారే తీర్పు విధించునని కొందరు, కడవరితీర్పు తీర్చుటకు ప్రభువు లోకాంతమందు వచ్చునని కొందరు.

3. ఇన్ని మిషనులుండగా రాజమండ్రి వాస్తవ్యుడనైన నాకు 1938 సం॥ము జనవరిలో దేవుడు బైబిలు మిషనును ఎందుకు బైలుపరచెనో, దానిని పైకి ఎత్తి చూపించుము అని ఎందుకు చెప్పెనో, ఇక ముందునకు ***సర్వత్రా సువార్త అందుటకై ఇండియా మూలస్థానమగునని ఎందుకు ప్రవచించెనో లోకమును, సంఘమును,***

*దేవునిని అడిగి తెలిసికొనవలెను. అన్ని మతములవారును, అన్ని మిషనులవారును, దండెత్తవలసినది నా బైబిలు మిషనే.*

4. ఐక్యత కలిగించుకొనుటకు ఒక పద్ధతి కలదు. ఆయా భాషలున్న ప్రదేశములలోని అన్ని మిషనులవారును, ప్రార్థనాపరులగు ప్రతినిధులను సమకూర్చవలెను. వారు ప్రభువుమీద ఈ ప్రశ్నలును, ఇంకనూ తోచిన ప్రశ్నలును వేయవలెను. బైబిలు వాక్యములకు నేడు అర్థములు చెప్పుచున్న బోధకులకు ప్రతిగా, ప్రభువే వాటికి జవాబు చెప్పును. అప్పుడు సిద్ధాంత భేదములు పోవును. భాషనుబట్టియు, ప్రదేశమును బట్టియు, చందాలు వచ్చు సొసైటీలను బట్టియు ఎన్ని మిషనులైనా ఉండవచ్చునుగాని సిద్ధాంత భేదమునుబట్టి అవి ఉండకూడదు.

*బైబిలునుబట్టిగాని, క్రీస్తునుబట్టిగాని మిషనులు ఏర్పడలేదు, భేదాభిప్రాయములనుబట్టి ఏర్పడినవి.* ఆ ప్రతినిధుల సమాజములకు దైవసన్నిధి కూటములని పేరు పెట్టుకొనవచ్చును. క్రీస్తును, పరలోక పరిశుద్ధులును, దేవదూతలును, భూలోక విశ్వాసుల ఆత్మలును వచ్చి జవాబులు చెప్పుదురు. అవి వ్రాసికొనవచ్చును. ఇట్టి అనుదిన కూటములు గుంటూరు, బెజవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, కాకినాడ మొదలైన స్థలములలో నున్నవి. అన్ని మతములవారును, అన్ని మిషనులవారును ఇట్టి కూటములు పెట్టుకొనవచ్చును. అప్పుడు దేవుడు మాటలాడును. దేవుడు చెప్పిన ప్రకారము చేయనియెడల ఇక చెప్పడు. అప్పుడు హాని కలుగును, చెప్పినట్లు చేసినయెడల మేలు కలుగును.

# 6. ది బైబిలు మిషను

**"ఆయన మీతో చెప్పునది చేయుడి" యోహాను 2:5.**

1. దేవుడు ఇప్పుడును కనబడును. దేవదూతలు, భూలోక విశ్వాసులు, పరలోక పరిశుద్ధులు, పరలోకము, పాతాళలోకము మొదలైనవన్నీ ఇప్పుడుకూడ విశ్వాసులకు కనబడుననేది బైబిలు మిషను సిద్ధాంతము. ఇది తక్కిన మిషనుల సిద్ధాంతములలో లేదు. 2. దర్శనమే కాక, మాట్లాడుటయేకాక, 3. ఆయన చెప్పి వ్రాయించుట ఉన్నది. ఇది తక్కిన మిషనులవారు ఒప్పుకొనరు. ఈ మూడు ఇతర మిషనులవారికి చెప్పించుటకే "ప్రభువు బైబిలు మిషనును స్థాపింపజేసిరి." యేసుప్రభువు దేవుడైనను మనుష్యులను రక్షించుటకు మనుష్యులలోనికి వచ్చి మనిషిపేరు పెట్టుకొనెను గదా! ఆలాగే మిషనులన్నిటికి వర్తమాన మిచ్చుటకు మరియొక మిషను వచ్చెను. అదే బైబిలు మిషను. ముందున్న మిషనులను, ఈ క్రొత్త మిషనును కలిపి మాట్లాడితే అదే సంఘమైనది. పై మూడుకాక బైబిలు మిషనువారు చేయు 4వ క్రొత్త బోధ ఏదనగా:

బైబిలంతా చదవడానికి మొదలుపెట్టి ఎక్కడెక్కడ ఏయే అద్భుతములు ఉన్నవో వాటన్నిటిని ఎర్రసిరాతో గుర్తుపెట్టి ఆ యద్భుతములన్నీ ఇప్పుడును జరుగునని చెప్పుట, ఇవన్నీ తెలిసికొన్నమీదట నమ్మినాసరే నమ్మకపోయినాసరే మీ ఇష్టము. దానికి మీరే ఉత్తరవాదులు.

*బైబిలు మిషను = బైబిలు పని. మిషను అనగా పని.* యేసుప్రభువు వారన్నారు. మీరు భూదిగంతములవరకు వెళ్ళి ఎ) సువార్త ప్రకటించండి బి) నాకు సాక్షులైయుండండి సి) శిష్యులను చేయండి. అనగా సంఘమును స్థాపించండి అని మూడు పనులు శిష్యులకు పెట్టెను. ఆ పనికే మిషను అని అర్ధము. బైబిలు నేర్చుకొన్నాము గనుక అది హృదయములోను, తలలోను ఉండేది అనగా బైబిలు బోధంతా మనిషిలో ఉన్నది. ఆదిలో ఉన్నదానిని,

బయటకు వెళ్ళి ఇతరులకు చెప్పేది. “మిషను” అయినది, అనగా పనైనది. ఆ పని ప్రభువు పెట్టినపనే. దానికే మిషను అని లోకభాషలో పేరు వచ్చినది. బైబిలు అనుపేరుకూడ లోకభాషలోనిపేరే, గనుక ఆ పేరు పెట్టుకున్నాము. మన మిషనుకు బైబిలు పేరే ఉన్నది. బైబిలు లేని మిషను ఒక్కటికూడ లేదు గనుక అన్నిటికిని బైబిలున్నట్లే. ప్రతి మిషనుకు బైబిలు లోపల నున్నది. అయితే బైబిలు మిషనుకు బైబిలుపైనను లోపలను ఉన్నది. ప్రతి మిషనులో లోపల ఉన్న బైబిలు, బైబిలుమిషనుయొక్క పేరులో బయటికి తెలియపర్చుచున్నది. మనము లోకములో ఉన్నాము. ఎందుకనగా యేసుప్రభువు బోధించిన బోధ అనగా శిష్యుల లోపలున్న మాటలు బయట పెట్టి బోధించినట్టు బైబిలు మిషను పేరులోనే బైబిలును పెట్టి అందరికి అందించుచున్నారు. బైబిలు మిషనువారికి ఇతర మిషనులలోవలె బైబిలు లోపలనున్నది, పైగా పేరు కలిగియుండుటనుబట్టి బయటకూడ యున్నది. బైబిలుమిషను తక్కిన మిషనులకు వ్యతిరేకమైనదికాక వాటికి క్రొత్త వర్తమానమిచ్చే అదనపు (Extra) మిషనైయున్నది. అనగా తక్కినవాటికి సహాయము చేయుటకు ఎక్స్ట్రా మిషనై యున్నది.

అదియునుగాక అది మనిషివల్ల వచ్చిన మిషనుకాదు. ప్రభువు స్వయముగా చెప్పినందువల్ల వచ్చిన మిషనై యున్నది. ఇరువైవందల యేండ్ల క్రిందట ప్రభువు అప్పటి శిష్యులతో చెప్పినట్టుగానే 1938వ సం॥ము జనవరి 31వ తేదిన యం. దేవదాసు అయ్యగారివద్ద ఎవ్వరు లేనప్పుడు, పట్టపగలు, (రాత్రికాదు) గాలిలో సువర్ణ అక్షరములతో “బైబిలుమిషను” అని వ్రాయబడిన వ్రాత ఆయనకు కనబడెను. అప్పుడు దేవదాసు అయ్యగారు ప్రభువుతో నాకేమిలేదు. విద్య, ధనము, బలము మొదలైనవేవి లేవు. మిషనరీలైతే నాలుగు మాటలతో నాలుగు నెలలో పైకి తెస్తారు ప్రభువా! అని అంటే, దేవుడు నీ ద్వారా జరుగుట నా చిత్తమైయున్నదని చెప్పెను. ప్రభువు పని చేసేటప్పుడు నిష్ట పనిచేయదు, సృష్టి పనిచేస్తుంది. అనగా బైబిలు మిషను నూతన సృష్టి,

బైబిలు మిషను అందరిచేత ద్వేషింపబడే మిషను. ద్వేషింపబడవలెను. క్రైస్తవ మతములో ఇన్ని మిషనులెందుకని క్రైస్తవేతరులు కొందరు దూషించుచుండగా, అదే ప్రకారము కొందరు క్రైస్తవులును, ఇతర మిషనులవారును ఇన్నివందల మిషనులుండగా ఇంకొక బైబిలు మిషనెందుకని దూషించుచున్నారు, ద్వేషించుచున్నారు జాగ్రత్త. ఆ దూషించుటలోను, ద్వేషించుటలోను బైబిలు పేరు ఎత్తకుండ దూషించలేరు. బైబిలును దూషించిన ఎవరిని దూషించినట్టు? ఎవరిని ద్వేషించినట్టు?

లోకమంతటిలో నుండి క్రైస్తవ సంఘమును బయటకి తీసి, సంఘములో నున్న అన్ని మిషనులలో నుండి బైబిలు మిషనును బయటకి తీసెను. లోకమంతటిలోనుండి సంఘాన్ని బయటికి తీసి, సంఘములో నుండి 7 శాఖలు తీసి, (7 సంఘాలు) ఏడు శాఖలలో పై శాఖలో అనగా లవొదికయ సంఘములో ఉండేటట్లు చేసినాడు. తక్కిన మిషనులలోని భక్తులకంటే బైబిలు మిషనులోని భక్తులు ఎక్కువకాదు గాని వారికంటె వీరికి సంగతి ఎక్కువ. బైబిలు మిషను చీ,చీ మిషను అనగా **చిట్టచివరి** మిషను అనగా మిషనులలో, సంఘములో చివరివారు, అనగా లవొదికయవారు అన్నమాట. ***బైబిలు* మిషనులో ఉన్నంత మాత్రమున ఆ అంతస్థురాదు. ఆ ప్రకారము నడువగలవారిదే అంతస్థు.** ప్రభువు ప్రార్థనలో 7 మెట్లున్నట్లు క్రైస్తవ సంఘములోను 7 మెట్లున్నవి. రక్షణ అందరికిని గాని ఆయన చెప్పినట్టు చేయువారికి సిద్ధపడువారికి రక్షణ+మహిమ. లోకములో క్రైస్తవ సంఘమున్నది. అది ఒక మెట్టు. అనేక క్రైస్తవ మిషనులున్నవి. అది ఒక మెట్టు, బైబిలు మిషను ఉన్నది, అది ఒక మెట్టు, ప్రభువు ప్రార్థన సంపూర్ణ ప్రార్థన. అట్టి సంపూర్ణ ప్రార్థన మనుష్యులెవ్వరు చేయలేరు. సంపూర్ణ ప్రార్థనలోని దీవెన మీకందరకు అందునుగాక! ఆమేన్.

**II. క్రొత్త మిషను:-** ఇన్ని మిషనులుండగాను, ఒక మిషనుకు విరోధముగా మరియొక మిషను తర్కించుచుండగాను, ఈ విషయము

Bible Mission HQ Guntur

ఇతర మతస్థులకు అడ్డుబండయై నిలిచియుండగాను, రాజమండ్రిలో బైబిలుమిషను అను నామముతో ఒక క్రొత్త మిషను ఎందుకు బయలుదేరవలెను? అను ప్రశ్నకూడ సామాన్యజ్ఞానవంతులు సహితము వేయవలసిన ప్రశ్నయైయున్నది. ***అన్ని మిషనులు ఇన్నాళ్ళనుండి కష్టపడి పనిచేయుచున్నను, క్రీస్తు సందేశము అన్ని ప్రదేశములకు అందలేదు గనుక క్రొత్త మిషను అనవసరముకాదు.***

**III. <u>బైబిలుమిషను ఎటువంటి మిషనుకాదు</u>:–** 1. మిషనెరీలను ఎదిరించు మిషనుకాదు. 2. మిషనులకు వ్యతిరేకముగా పనిచేయు మిషనుకాదు. (అనగా పోటీ మిషనుకాదు) 3. ఇతర మిషనులను దూషించుమిషనుకాదు. 4. ఇతర మిషను వారలారా! మాలోనికి వచ్చినగాని మీకు రక్షణలేదు. అని భయపెట్టు మిషనుకాదు. 5. ఎవరినైనను చందా అడుగు మిషనుకాదు. వస్తురూపముగానైనను కానుకలనడుగు మిషనుకాదు. 6. ఒకరు వెళ్ళిపొమ్మనుటకు ఏ కారణముగల మిష చూపించు మిషనుకాదు. 7. ఒత్తిడి కలిగి లూథరన్ మిషనులోనుండి వచ్చివేసిన మిషనుకాదు. 8. జ్ఞానమునుగాని, భక్తినిగాని, సమర్ధతనుగాని వెళ్ళడించుకొనుటకై వెడలిన మిషనుకాదు.

**IV. <u>బైబిలుమిషను ఎటువంటి మిషను</u>?** 1) మీ బోధలు మాకు నచ్చినవి. ప్రార్థన చేసికొన్నాము. మమ్మును చేర్చుకొనండి అని అడుగు ప్రతి వారిని చేర్చుకొను నట్టి మిషను. 2) చేరిన తరువాత 'నాకిష్టములేదు' అను ప్రతివారిని వెళ్ళనిచ్చునట్టి మిషను. (అనేక మిషనులున్నవి గనుక ప్రతి విశ్వాసి ఏదోయొక మిషనును హత్తుకొని యుండుట క్షేమము) 3) కోరునట్టి క్రైస్తవులకు సహితము బోధలు వినుపించునట్టి మిషను. 4) బేధాభిప్రాయములు లేచినప్పుడు ప్రభువు స్వరముతో జవాబిచ్చువరకు ప్రార్థనలో కనిపెట్టునట్టి మిషను. 5) ఇతరులను చందాలు అడుగకపోయినను అక్కరలు దేవునికి తెలిపి సహాయము పొందునట్టి మిషను. 6) రిపోర్టు అనునది చరిత్ర గనుక

దానిలో అక్కరలు ఉదహరించుచూ ప్రార్థన సహాయము కోరునట్టి మిషను. 7) కోరని క్రైస్తవులకుకూడ పరీక్షార్థమై మొదటి మారు బోధలు వినుపించునట్టి మిషను. 8) తప్పులు పట్టువారిని, ఉభయపక్షములు విచారింపనివారిని, లేనిపోనివి కల్పించువారిని, దూషించు వారిని, మమ్మును చేరనియ్యనివారిని, మా దైవసేవను ఆటంకపరచువారిని, ముఖ్యముగా మమ్ములనుగురించి దేవుని అడిగి తెలిసికొననివారిని మాలో కొందరి బలహీనతలను ఒక వంకగా చేసికొని మిషనంతయు వాక్యవిరుద్ధమే అని తీర్మానించుకొను వారిని, మా ఎదుట మంచిగా మాట్లాడి, చాటున వేరుగా మాట్లాడుకొను వారిని, ఏమియును అనక సహించుకొనుచు, అట్టివారి నిమిత్తమై దైవప్రార్థన చేయునట్టి మిషను.

**V. బైబిలు మిషను ఎట్టిస్థితిలో ఆరంభమాయెను?** 1) నిలువసొమ్ము లేని స్థితిలోను, 2) పొలములు, స్వదేశ సమాజములు, విదేశ సమాజములు మొదలగు రాబడి సాధనములు లేని స్థితిలోను 3) పాఠశాలలు, బోర్డింగులు, ఆశ్రమములు, వైద్యశాలలు, చేతిపనులు నేర్పునట్టి వృత్తి శాలలు మొదలగు జనోపకార్యముల ఎరలకు సందులేని స్థితిలోను 4) నన్ను ఈ సువార్త వ్యాపకార్థమై పనివారికి జీతములు, ఇతర సదుపాయములు చేయగల తాహతులేనిస్థితిలోను. 5) గ్రంథ రచన కార్యములకు వీలుపడని స్థితిలోను, స్వంత మిషను విడిచిపెట్టుట గొప్ప దోషమును, అనర్థమునైయున్నదని నలుగురు నాలుగు మాటలు అనుచున్న స్థితిలోను ఆరంభమాయెను.

**VI. ఏ కారణములనుబట్టి ఈ మిషను స్థాపితమాయెను?** 1) అదివరకున్న మిషనులోనుండి వచ్చివేయండి అని ప్రభువు మాకు చెప్పిన మాటనుబట్టియు 2) ఒక మిషను స్థాపించి, దానికి "బైబిలుమిషను" అనుపేరు పెట్టవలెను అని ప్రభువిచ్చిన సలహానుబట్టియు స్థాపితమాయెను.

# 7. బైబిలు మిషనులోనికి సంఘస్తులుగా చేరగోరువారు

(ఎ) బోధల భేదాభేదములను అర్ధముచేసికొని, సబబుగానున్నవని అంగీకరించు జ్ఞానమును, మనస్సాక్షినిబట్టి వచ్చినయెడలగాని, పరిస్థితులను బట్టి అనగా సమయ సందర్భానుసారముగా చేయబడిన బోధలు అనుకొననిరీతిగా తారసిల్లుటనుబట్టిగాని, అనాలోచన స్థితియందు కల్గిన స్వప్నమునుబట్టిగాని వచ్చినయెడల ఏమియు అనము.

(బి) అయితే ప్రభువు స్వయముగా మాకు చెప్పినందువల్ల వచ్చినామని అన్నవారిని గొప్ప సంతోషముతో చేర్చుకొందుము. ఇట్టివారే రావలెనని మా ముఖ్యమైన కోరికయు, సలహాయునై యున్నది.

**VII. బైబిలు మిషనుయొక్క ఆది చరిత్ర:–** 1) మా క్రొత్త బోధలు విచారింపవలసినదని మేము లూథరన్ మిషనెరీలను విన్నవించిన రెండేళ్ళకు మరలా జ్ఞాపకము చేయగా, మా అభిప్రాయములు విన్నమీదట, విచారణ సమాజమేర్పడినప్పుడు మిషనెరీలు "మీ బోధలు బైబిలులో గలవుగాని, లూథరన్ మిషను సిద్ధాంతములలోలేవు" అని చెప్పిరి. అప్పుడు మేము అట్లయినయెడల ఇప్పుడైనను వాటిని మిషనులో ప్రవేశపెట్టుడని కోరుకొంటిమి. అందుకు వారు *"మీరు మిషనులోనుండి వెళ్ళిపోయి వేరొకమిషను పెట్టుకొని మీ బోధలు బోధించుకొనండి. మేమప్పుడు ఇతర మిషనులను గౌరవించు చున్నట్లు మిమ్మునుకూడ గౌరవింతుము అని అన్నారు (1938 జనవరిలో).* 2) తర్వాత ప్రభువు **"వచ్చివేయండి"** అని 46 సం॥లు లూథరన్ మిషనులో ప్రభువు సేవచేసిన శ్రీ. యం. దేవదాసు అయ్యగారికి ప్రభువు చెప్పిరి. అందుచేత ఆయన ఎవరి ఆలోచనను కోరక, తనమట్టుకు తాను లూథరన్ మిషనుకు రాజీనామా పెట్టిరి. మిషనెరీలు చాలా విచారపడిరి. తిరిగి వచ్చివేయమని ప్రేరేపించిరి.

ప్రభువు మమ్ములను **"వచ్చివేయండి"** (సైన్యముయొక్క యువరాజువలె బయటికి వచ్చివేయుము) అని అన్నందువల్ల తిరిగి లూథర్ మిషనులోనికి మేము వెళ్ళలేదు. 3) లూథరన్ మిషనువారు రాజీనామా పత్రము అందుకొన్నప్పటికిని అంగీకరించినామని వ్రాతమూలముగా వారాయనకు తెలియపరుపలేదు. వారు మమ్మును వెళ్ళిపొమ్మనుట లూథరన్‌మిషను కట్టడలనుబట్టి చూడగా ధర్మముగానే కనుపించ వచ్చునుగాని, బైబిలు వ్రాతనుబట్టి చూడగా అట్లు కనుపించుటలేదు. అది వారికి తట్టలేదు.

**VIII. గ్రంథ ప్రచురణ:-** ప్రస్తుతము ముద్రించబడి అందుబాటులో ఉన్న పుస్తకములు- దైవలక్షణముల స్తుతి, సైతాను నెదిరించు సూత్రములు, రాకడ ప్రార్ధనలు స్తుతులు, సమర్పణ ప్రార్థన, ఉపవాస ప్రార్ధన దీక్ష, ఉపవాస ప్రార్థన ప్రకరణము, రక్షణ పద్యములు, సన్నిధి సంపద, దేవుడు ఎందుకు ఊరుకొనుచున్నాడు, మహిమ వార్తావళి, వాగ్ధాన మంజరి, సువిశేష దోరణి, రక్షణ సంకల్పన దండకము, ఇమ్మానుయేలు, నీతిసూర్యుని కళలద్దు దైవసాన్నిధ్యము, మనస్సాక్షి, ద్వితీయాగమనము, సంఘారాధనలు, నిరపాయ పత్రిక, క్రిస్మస్ వర్తమానములు, ప్రభువు సంస్కారపు విందు వర్తమానములు, ప్రకటన గ్రంథ వివరము, పరమ గీతార్ధము, ద్వితీయాగమన సందేశములు, రక్షణ వాణి, రక్షణ వార్తావళి, ప్రార్థన మంజరి, క్రైస్తవ పండుగల సందేశమాల, శ్రమకాలపు గుడారము, ఆత్మీయ స్వస్థత, ప్రార్థనావళి, దేవదాసు అయ్యగారి జీవిత చరిత్ర, సిలువ విలువ ధ్యాన కలువ, మోషే సుఖోపవాస ధ్యానదీపిక, జ్ఞాతవ్యము (1,2,3 భాగములు), రాకడ రవళి. ఇదివరకు అచ్చువేయబడిన పుస్తకములు- అభయాని, విమలాత్మ ప్రోక్షణ, పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి తెలిసికొనవలసిన సంగతులన్నియు దీనిలో గలవు. వివరములు తెలిసికొనగోరిన వారు బైబిలు మిషను ఆఫీసును సంప్రదించండి.

# 8. బైబిలు మిషను సిద్ధాంతములు

**"ఆయన మీతో చెప్పునది చేయుడి" యోహా. 2:5.**

**1వ సిద్ధాంతము:–** ఇది దైవసన్నిధి కూట వాక్యముగా వచ్చును. ఎలాగనిన లోకములోని ప్రతి కుటుంబములో దైవసన్నిధి కూటము పెట్టుకొనవలెను. (ఎ) దేవా! నాకు కనబడుము (బి) నాకు చెప్పవలసినవి చెప్పుము. (సి) నేను వేయు ప్రశ్నలకు జవాబు చెప్పుము. వినిపించుము అని ప్రార్థించిన యెడల, ప్రభువు మనుష్య రూపముతో కనబడును. బైబిలులో దేవుని వ్రాత వాక్యములున్నవి. అవి ఆదివారము పాదుర్లు వివరించుచుండగా మనము వినుచున్నాముగదా! ఆలాగే యేసుప్రభువు అను పాదిరిగారు బైబిలు వచనములు వివరించునట్టి ప్రసంగము చేసిన యెడల మనము వినకూడదా! తన వాక్యమును తన నోటి మాటలతో తాను వివరించుటకు క్రీస్తు ప్రభువునకు హక్కు లేదా!

ఈ దినములలో క్రీస్తు ప్రభువు మనలో ఎవరితోను మాట్లాడడు ఎందుకనిన 'చెప్పవలసినవన్నియు బైబిలులోనే వ్రాసిపెట్టి ఉంచినాడు' అని కొంతమంది క్రైస్తవ భక్తులనుచున్నారు. బైబిలు వాక్యమువల్ల మాలో సంతుష్టి కలిగినది గనుక మేము ప్రభువును అడుగము. అడిగిన యెడల ఓ అవిశ్వాసులారా! నేను బైబిలులో వ్రాసిపెట్టినానుగదా! నన్ను మరలా ఎందుకు అడుగుచున్నారు అని ప్రభువు ఒకవేళ గద్దించునేమో అని మేము అడుగనే అడుగము అంటున్నారు. ఇప్పుడు కొంతమంది లేచి ప్రభువు మాతో మాట్లాడుచున్నాడు అని చెప్పుచున్నారు. ఆ మాటలు వారి ఊహలు కాని, ప్రభువు మాటలు కావు అని కొందరు అనుచున్నారు.

పాదుర్లు చేయుచున్న ప్రసంగములు మాత్రము ఊహలు కావా! అని మేము తిరుగు ప్రశ్న వేయుచున్నాము. మీకు మేము చెప్పవలసిన

మోటు జవాబు ఏదనగా ప్రసంగము మానివేసి క్వేకర్లవలె బైబిలులో ఉన్నది ఉన్నట్టే చదివి ఊరుకొనవలెను. ఏమంటే ఓ పాదిరి గారూ ఈవేళ వాక్యము వివరించలేదని సభికులు ఎవరైనా అడిగిన యెడల జవాబు:- బైబిలులో ఉన్నదానికంటే నేను ఎక్కువ చెప్పగలనా అని జవాబు ఇయ్యవలసి వచ్చును ("క్వేకర్లు" (క్వేకర్ మిషనువారు) ఇప్పుడు తమ ఉద్దేశము మార్చుకొన్నారట.

మా మిషనులో ఇప్పుడు కొందరు దైవసన్నిధి కూటములు పెట్టుకొన్నారు. ప్రభువు వచ్చి మాటలాడుచున్నాడు. 1) యదార్థపరులైన భక్తులు వచ్చి పరీక్షించుట వినవలెను 2) మేము వ్రాసికొన్న వ్రాతలు చదువవలెను. 3) ప్రభువా! ఇవి నీవు చెప్పినవేనా అని అడుగవలెను. ఈ మూడు పనులు చేయుటకు నీకు విశ్వాసధైర్యము లేదా:-

మమ్మును నిందించుటకు మీకు పరిచయమున్నది. ప్రభువు అడుగుటకు మీకు పరిచయము లేదా!

మీకు కావలసిన అన్నవస్త్రాదులను గురించియు, కష్టనివారణ గురించియు అడుగుటకు మీకు పరిచయమున్నది గాని బైబిలు వివరించుమని ప్రభువును అడుగుటకు పరిచయములేదు గదా! విచారము.

ప్రశ్న:- సైతానును, ప్రభువు మీరు వెళ్ళి సువార్తను బోధించుడని చెప్పునా! ఒకప్పుడు దయ్యము, ప్రభువుని చూచి నీవు పరిశుద్ధుడవు అని అన్నప్పుడు యేసుప్రభువు "ఊరుకో" అన్నారుకదా!

అరణ్యములో సాతాను ఈ రాళ్ళు రొట్టెలు చేయుమనియు, నీ పాదములకు రాయి తగులకుండా, దేవదూతలు కాపాడుదరని వ్రాయబడిన వాక్యము ఎత్తి చెప్పిన సైతాను. ఇదిగో నేటి దినాలలోను ప్రభువు రాకడ దగ్గర పడింది నీ దగ్గర ఉన్న బైబిలు ఉన్నది అంటున్నాడు.

**2వ సిద్ధాంతము:-** చిన్న పిల్లలకు బాప్తిస్మము ఇయ్యవచ్చునో ఇయ్యకూడదో ఆ సంగతి బైబిలు వ్రాతలో లేదుగాని, ప్రభువు సన్నిధి కూటములో చెప్పుచున్న మాటలలో ఉన్నది ఏమని? ఇయ్యకూడదని.

మా చిన్న తనములో "దేవుడు కనబడువాడనేది" సంఘము యొక్క బోధలో లేదుగాని అక్కడక్కడ క్రైస్తవుల అనుభవములో విన్నాము గాని మిషను బోధలోలేదు. ఇప్పుడిప్పుడు మన కాలములో, బోధలో ప్రవేశపెట్టిరి. పాతనిబంధన కాలములో భక్తులు 1) బలివేయాలి 2) సున్నతి చేయాలి 3) ఆచారములు జరిగించాలి అని చెప్పిరి. గాని క్రొత్త నిబంధనలో అవేవి అక్కరలేదన్నారు. క్రొత్త నిబంధన అనగా 'ప్రకటన గ్రంథము' అయిన తరువాత సంఘకాలము వచ్చింది. అది భేదాభిప్రాయమువల్ల 850 శాఖలైపోయినది. వీటన్నిటిని బైబిలు వచ్చి కలుపవలెనంటే ఏలాగు కలుస్తాయి. అయ్యగారు చెప్పిన ప్రసంగాలు అచ్చువేస్తే గొప్ప కలహము వచ్చును.

**3వ సిద్ధాంతము:-** ఎప్పుడైననూ సరే నేను చెప్పిన తరువాత సందేహాలు ఉంటే ప్రశ్నలు వేయవచ్చును. బైబిలులో జరిగిన అద్భుతములు అవసరమునుబట్టి ఇప్పుడును జరుగును.

ఉదా:- ఆకాశము నుండి ఉరుములు, పిడుగులు, వడగండ్లు, వర్షము కురిసినప్పుడు ఆటంకముగా ఉంటే ఆగు అని అంటే ఆగును. ఆలాగనుటకు మీకు 1) విశ్వాసమున్నది 2) ధైర్యములేదు. తీరా అంటే ఆగకపోతే అందరు నవ్వుతారనేది 1) సందేహముండును 2) భయముండును అదే మన పాపము. అందుచేత జరుగదు.

ఉదా:- ఒక దొరగారు ఒకప్పుడు వర్షము వస్తూ ఉంటే బయటకి వచ్చి పాదిరి రిటెయిన్ (Father Retain) అనగా తండ్రీ! ఆపుము అన్నారు. వెంటనే ఆగిపోయినది. సత్యానందముగారు ఒక

మాట చెప్పినారు. ఒరిస్సాలో కోరాపుట్‌లో నరబలి జరుగును. రహస్యంగా ఆస్థలములో చాలా స్థలాలకు 'పూజారి' ఉన్నది. ఆమె చనిపోగా 10 వేలమంది ఏడ్చుచున్నారు వారిలో ఒకడు బాప్తిస్మము పొంది క్రైస్తవుడైనాడు అని, వానిచేత ప్రార్ధన చేయించుటకు కట్టివేసిరి. ఆ కొండవాళ్లు అతివిశ్వాసము గలవారు. అతనీలాగు ప్రార్థించెను. తండ్రీ! నీ రక్షణలోనికి వచ్చి రెండు నెలలు అయినది. నీవు లాజరును బ్రతికించినావు ఈమెను కూడా బ్రతికించుము అని ప్రార్థించెను. ఆమె ఆత్మను పండ్లు కొరుక్కునే స్థలములో వేసిరి. "ప్రభువు" ఆమెతో అన్నారట. నిన్నుబట్టికాదు గాని నా దాసుడు ప్రార్ధనను బట్టి నిన్ను బ్రతికించుట అని చెప్పిరి.

**4వ సిద్ధాంతము:-** మందులు లేకుండా కేవలము ప్రార్ధన వల్లనే జబ్బు పోగొట్టుకొనవచ్చును. (అధైర్యముంటే ప్రార్ధన చేసికొని మందు వేసికొనవచ్చును).

**5వ సిద్ధాంతము:-** "స్త్రీలు" సంఘములో మాటలాడవచ్చును అని ప్రభువు చెప్పుచున్నారు. బైబిలును నమ్మేటప్పుడు 'ప్రభువు చెప్పేది' ఎందుకు నమ్మరాదు?

**6వ సిద్ధాంతము:-** "స్త్రీలు" నగలు ధరించుకొనవచ్చునని ప్రభువు చెప్పుచున్నారు. ప్రభువు చెప్పుచున్నారంటే అది బైబిలులో లేదన్నమాట.

**7వ సిద్ధాంతము:-** "బాప్తిస్మము"

ఎ) క్రైస్తవుల పసిపిల్లలకు బాప్తిస్మము ఈయనక్కరలేదు. వారికి మోక్షమున్నదని ప్రభువు చెప్పుచున్నారు.

బి) అన్యుల పిల్లలకు కూడా బాప్తిస్మము లేకపోయిననూ మోక్షమున్నదని ప్రభువు చెప్పుచున్నారు. ఇతర మిషనుల వారు, ఈ

మాట బైబిలులో ఉన్నవా అని ముఖము చిట్లించుకొని అడుగుచున్నారు. దానికి మనమిట్లు చెప్పాలి:-

సి) 1) మీకు వ్రాత బైబిలే ఉన్నది 2) అయితే మాకు రెండు బైబిళ్లు ఉన్నవి. అనగా (ఎ) ఒక వ్రాత బైబిలు (బి) రెండవది మాట బైబిలున్నది.

డి) విద్యార్థికి పుస్తకమున్ననూ పాఠములు టీచరు (1) వివరించి (2) బోధించుట అవసరము. అట్లే మనకు బైబిలు ఉన్ననూ, మనకు ప్రభువు వివరించుట అవసరము.

ఇ) కొందరికి బాప్తిస్మము తీసికొనుటకు ఇష్టమున్నప్పటికిని, ఆటంకమునుబట్టి పొందలేరు గాని వారు అంతరంగ క్రైస్తవులుగాన వారికిని మోక్షమున్నది. ఇది విని ఎవరైనా ఉద్దేశ పూర్వకముగా బాప్తిస్మము పొందకపోతే వారికి రక్షణలేదు.

*ఎఫ్) ముంచిగాని, చిలకరించిగాని, పోసిగాని బాప్తిస్మము ఇయ్యవచ్చును. నీళ్ళుముఖ్యము:- ఏ పద్ధతియైన ఫర్వాలేదు. తండ్రి యొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామమున్నది. గనుక ఏ పద్ధతియైనను సరియే. నీళ్ళ తీసి తలమీద చిలకరించిన యెడల అది చిలకరింపు అగను.*

రోమన్ కాథలిక్ వారు జబ్బుగా ఉన్నవారి యొద్దకు (దగ్గరకు) వెళ్ళి చిన్న బుడ్డిలోని నీళ్లు వారికి చెప్పకుండానే తలమీద మూడు చుక్కలు వేయుదురు. కాథలిక్కులకు అన్ని సిద్ధాంతములున్న పుస్తకమొకటి వారి వద్దనుండును. ఒక పాదిరిగారి యొద్ద అయ్యగారు చూచిరట.

ముంచుట:- ఒక పాదిరిగారు ఒక అతనికి ముంచి బాప్తిస్మము ముంచి ఇస్తుండగా అతనికి భయము పుట్టి, అట్టే మునిగిపోవుచుండగా

దగ్గర ఉన్నవారు తడిమి, తడిమి చివరకు ఒడ్డుకు తీసిరి. నీళ్లు చాలా మ్రింగి చావసిద్ధమయ్యే, అంతలో తీసిరి. ఇది అంతా ఎందుకు? నీళ్లు బాప్తిస్మమిస్తే చాలును బాప్టిస్టు వారిని లూథరన్స్ వారుంటారు. బాప్టిస్టులు లూథరన్స్‌ను చిలకరింపువాళ్ళు అంటారు.

యేసుప్రభువు ఏలాగు బాప్తిస్మము పొందిరో సన్నిధి కూటములో చెప్పిరి. నీళ్ళుపోసి స్నానికుడైన యోహాను బాప్తిస్మమిచ్చినట్లు చెప్పిరి. డా॥మార్టిన్ లూథరు నీళ్ళుపోసి బాప్తిస్మము పొందిరని చెప్పిరి. డా॥ మార్టిన్ లూథరుకు నివేది చెప్పిన గాలిలో వ్రాసి చూపించేవారు. దర్శనములో చెప్పినందునకాదు. డా॥మార్టిన్ లూథరు వాటేబర్గ్ కోటలో బంధింపబడియుండగా ఒక కబురు వచ్చెను. మీరు కోటలో ఉన్నారు. ప్రవక్తలు ఒక ప్రశ్న క్రిందనుండి తెచ్చిరి అదేమనిన చిన్నపిల్లలకు బాప్తిస్మ కూడదని/ఇవ్వవచ్చునని మీరు బోధిస్తున్నారని చెప్పిరి. మీరు క్రిందికి దిగి అట్టివారిని ఖండించండని లూథరును కోరిరి. లూథరుగారు ఆ మాట నేను అనలేదు. చిన్నపిల్లలకు బాప్తిస్మము ఇవ్వవలెనని నేను చెప్పలేదు. ఇవ్వనులేదు అనెను. ఎందుకనగా ప్రభువు ప్రతిది నాకు వ్రాతలో చూపించుచుండగా నేనెందుకు అట్లు అందునన్నారు.

40 సం॥ల క్రితమే మేము లూథరు గారిని పిలిచి, అయ్యా లూథరు మిషనువారు దర్శనాలు నమ్మరు ఎందుచేత? మీరేమంటారు అని అడుగగా లూథరుగారు అయ్యగారితో ఇట్లు అనిరి. అమెరికాలో నీవెరిగిన మిషనెరీ ఉన్నారు. ఆయన లైబ్రరీలో ఒక పుస్తకము ఉన్నది నీవు ఆయనకు వ్రాసి తెప్పించి చదివిన యెడల దర్శనములు ఉన్నవని తెలుస్తుందని చెప్పిరి. అయ్యగారు వెంటనే వ్రాసిరి. అయితే కోరిన పుస్తకము కాక, వేరొక పుస్తకము పంపిరి. లూథరుగారు చెప్పింది దీనిలోలేదు. అయితే నా దర్శనము తప్పా? కొన్ని దినములైన తరువాత ఆ పుస్తకము గుంటూరులోనే దొరికింది. మీటింగులకు అప్పుడప్పుడు

ఈ గుంటూరు వచ్చేరు. ఈ రోజుల్లో దొరికింది. ఈ కాలములో దర్శనములున్నవని తెలియుచున్నది. అది లూథరునుకాదు వేరే మిషనువారు వ్రాసిరి.

1) లూథరు గారు ప్రవక్త 2) ప్రార్థనా పరుడు 3) దర్శన పరుడు 4) కవీశ్వరుడు 5) గొప్ప బోధకుడు అని అందులో ఉన్నది.

(1) రాజులు ఆయనను చూచి భయపడిరి గాని చిన్నపిల్లలు ఆయన దగ్గరకు చేరిరి. (2) పండితులు ఆయన దగ్గరకు చేరిరి గాని సామాన్యులు ఆయన దగ్గరకు చేరిరి.

గుడిలో ప్రసంగము చేయుటకు పులిపీఠము ఎక్కితే సింహము వలె కనిపించేవాడట. అయ్యగారు ఆయన ప్రసంగాలు చదువగా అన్ని కాథలిక్కువారికి డోసులే. ఆయన కాలములో దిద్దుబాటు చేసిన దిద్దుబాటుల పుస్తకము రెఫరెన్స్‌లతో ఉన్న ఇప్పటి మన బైబిలంతా పుస్తకమున్నదట. (ఆదికాలము యొక్క దిద్దుబాటు చరిత్ర). లూథర్ కాలమునకు ముందు చీకటికాలము. ఆయన బైబిలు బైటికి తీసికొని వచ్చినప్పటినుండి వెలుగుకాలము. కాలేజి విద్యార్థులకు లూథరు చరిత్ర తెలియకుండా ఉండదు. తెలియని వారుండరు. క్రొత్త నిబంధనలు రెండు కలిపితే ఎంత ఉంటుందో అంత పుస్తకములో చిన్న అచ్చు అక్షరములతో లూథరు చరిత్ర వ్రాయబడియున్నది. వేలతరబడి పుస్తకాలు అమెరికా నుండి గుంటూరుకు లూథరన్ బుక్ డిపోకు పుస్తకాలు వస్తున్నవి. రాజమండ్రికి రావడములేదు. దాని ప్రక్కన గవర్నమెంటు బుక్ స్టాలు ఉన్నది దానికి అమెరికా నుండి ఎన్నో పుస్తకములు వస్తున్నవి.

**8వ సిద్ధాంతము:–** సిద్ధాంతములన్ని పెద్దవే, చిన్న సిద్ధాంతమేది అని చెప్పడానికి రోజులు రోజులే కూర్చోవాలి. హేడెస్సులేదని

చెప్పేవారికి నేను చెప్పే భయంకరమైన మాట నీ కొడుకు చచ్చిపోతే హేడెస్సుకు వెళ్ళి పాతాళలోకములో మారుమనస్సు పొందితే మోక్షానికి వెళ్తాడని నీకు తెలిస్తే నీకు ఇష్టముండదా? అని అడిగితే అటువంటి ఏర్పాటు కూడా ఉందా బాబూ అని అంటాడు. ఎవరైనా సరే హేడెస్సును గూర్చి ఈమాటే అనండి నీవు చచ్చిపోతే నీకు నరకమే అంటాడు. అది నీకు సర్దాగా ఉంటాదా! ఈ మాట చెప్పడములో సాపుగా (నెమ్మదిగా) చెప్పవలెను. మనుష్యులు వారి తిక్క ఆలోచనలు బైబిలుకు చేర్చి చెడిపోతున్నారు.

1సమూ. 2:6లో ఒకమాట ఉన్నది, పంపేవాడు పాతాళము నుండి రప్పించువాడు ఆయనే. పాతాళమనగా హేడెస్సు ఇంతకంటే వివరముగా ఏమికావాలి. మూలగ్రంథములో ముభావంగా చెప్తుతారు. వివరము వ్యాఖ్యానాలలో ఉంటుంది గనుక ప్రతి సంగతి ఎదిరించే వారు ఉంటారు.

బెజవాడనుండి రాహేలమ్మగారు వచ్చినారు. ఆమె దర్శనములో రెండు ప్రక్కలనుండి రెండు నక్షత్రాలున్నవి. వాటి మధ్య కొబ్బరి మట్ట ఉన్నవట. అదేమిటి ప్రభువా అంటే "బైబిలు మిషను" అన్నారట. ఆలాగే ప్రతి మతములో ప్రతి మిషనులో దైవకళ ఉన్నది. ఈ మధ్యలో కొబ్బరి మట్ట వచ్చింది –చెట్టుకాదు. అనేక స్థలములలో బైబిలు మిషను గూర్చి ఆయావారికి బైలుపడినది అని చెప్తుతారు గాని ఇతరులు నమ్మరు. బైబిలులోని మూలము తెలిస్తే నమ్మకేమి?

బైబిలులోని నా అభిప్రాయములు దేవుడు, దేవదూతలు, పరిశుద్ధులు, సృష్టి అంతా చెప్పినా నేను స్వయముగా చూచినాను, విన్నాను అని చూచినవారు చెప్పినా, నమ్మనివారు చాలమంది ఉన్నారు. ఏమి చేయగలము.

# 9.బైబిలు మిషను ఇతర విషయములు

I. **బాప్తిస్మ వివరము:–** ముముక్ష = రక్షణ. సంస్కృతములో ముముక్షము – రక్షణ మార్గము.

మీరు యేసుక్రీస్తు సువార్త విని రక్షణ పొందారుగాని ఇంతవరకు బయట ఉన్నారు. ఇప్పుడు బాప్తిస్మము ద్వారా సంఘములో చేర్చబడ్డారు. ఇంటికి తలుపు ఎటువంటిదో బాప్తిస్మము సంఘమునకు అటువంటిది. యేసుప్రభువు భూలోకములోనే సంఘమును స్థాపించినారు. ఈ బాప్తిస్మముద్వారా సంఘమును పరలోకమునకు తీసికొని వెళ్ళును. ప్రభువు మిమ్ములను పిలుచు పర్యంతము విశ్వాసములోనే ఉండవలయును. మీరు నమ్మిన బాప్తిస్మములోను, విశ్వాసములోను దృఢముగా ఉండవలెను.

**ప్రార్థన:–** ఓ ప్రభువా! భూమిమీద నీ సంఘమును స్థాపించినావు. దానికి బాప్తిస్మమనే ద్వారము ఏర్పరచి రండని అందరిని పిలుచుచున్నావు గాని కొందరే వస్తున్నారు. మా రక్షణ కొరకు బైబిలును ఏర్పరచినావు. సంఘమునుకూడా ఏర్పరచినావు. ఆ బైబిలును బోధించుటకు సంఘమును ఏర్పరచినావు. నీకనేక వందనములు. ఈ నీ సంఘములో ఈ నీ బిడ్డలు ఈ దినము చేర్చబడుటకు బాప్తిస్మము కోరుచున్నారు. నీకు వందనములు. వారిని నీవు తీసికొని వచ్చినందుకు వందనములు. ఓ ప్రభువా! వీరు ఎన్ని కష్టములు, శ్రమలు, నిందలు, అవమానములు వచ్చినప్పటికిని ధైర్యముగా స్థిరముగా ఉండునట్లు కాపాడుము. ఈ ప్రార్థన ప్రభువుద్వారా అంగీకరించుమని వేడుకొంటున్నాము ఆమేన్.

విశ్వాసములేని క్రియలు అంగీకరించబడవు. అలాగే క్రియలు లేని విశ్వాసముకూడా లెక్కకు రాదు. నీవీలోకములో ఉన్నప్పుడు పరిశుద్ధుడవై ఉన్నావు. ఇసుకమీద కట్టు ఇల్లు నిలువదు.

రాతి మీద కట్టే పునాది గట్టిగా ఉండును. ఈ దినమునుండి వీరి విశ్వాసము రాతిమీద కట్టిన ఇల్లు ఎట్లయితే చెదరక పడిపోక నిలిచియుండునో అట్లే వీరి విశ్వాసము స్థిరపరచుమని వేడుకొంటున్నాము. పేతురు కొర్నేలి ఇంటిలో అనేకమందికి బాప్తిస్మము ఇచ్చెను. అన్యులకు బాప్తిస్మము ఇచ్చుట యూదులకు ఇష్టములేదుగాని దైవాజ్ఞ చొప్పున పేతురు కొర్నేలి ఇంటిలో ఇచ్చెను. నదిలోగాని, చెరువులోగాని, కుండిలోగాని, గిన్నెలోగాని నీళ్లు ఉంచి ఇవ్వలేదు. ఇలాగే ఇచ్చినారు (తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామములో తలపై నీరుపోయుట) అదే విధముగా బాప్తిస్మము ఇచ్చే రోజున మీకు ఇవ్వబడును.

**2) బాప్తిస్మము సిద్ధాంతము:-** బాప్తిస్మమనే మాట గ్రీకు భాషలోనుండి వచ్చినమాట. బాప్తిస్మము అనేమాటకు నిజమైన అర్థము ముంచుట, పోయుట, చిలకరించుట. ఈ మాటలు యూదులు వాడు మాటలు. వారు ముంచుట, పోయుట, చిలకరించుట, నింపుట బాప్తిస్మములు అవి వారి వాడుక. స్నానికుడైన యోహాను వచ్చిన తరువాత ఈ బాప్తిస్మము అనుపేరు ప్రాముఖ్యతలోనికి వచ్చినది. బాప్తిస్మమను ఈ ముఖ్య సిద్ధాంతము క్రీస్తు సేవకంటే, శోధనకంటె, సిలువకంటె, మరణ పునరుత్థానముకంటె ముందు స్థాపింపబడినది. 1. వాక్యము వినుట, 2. మారుమనస్సు 3. బాప్తిస్మము పొందుట. ఈ విధముగా బాప్తిస్మము పొందితే మంచిదే. బైబిలునకు సరిపోవును. లేకపోతే మిషనెరీల బాప్తిస్మమగును. యేసుక్రీస్తు వారి శిష్యులుకూడా అనేకమందికి బాప్తిస్మము ఇచ్చిరి. ఇదియే సంపూర్ణ సువార్త. పునాదులు త్రవ్వి గోడలు కట్టకపోతే ఏమి లాభము? వాక్యమను పునాది వేసినప్పుడు బాప్తిస్మము ఇవ్వకపోతే లాభములేదు. చిలకరింపు బాప్తిస్మము రోమన్ మతములోనుండి లూథరన్ మిషనులోనికి

వచ్చినది. అదినేటివరకు జరుగుచున్నది. బైబిలులో 87 పర్యాయములు ముంచడము అని ఉన్నది. అపోస్తలులు కార్యములు (అపో॥కార్య॥ 8:12)12 పర్యాయములు చిలకరింపునుగూర్చి వ్రాయబడినది గనుక అనేకులకు తారుమారుగా ఉన్నది.

**3) బాప్తిస్మము క్రమము:-** తండ్రి కుమార పరిశుద్ధాత్మ నామమున ఇచ్చేటప్పుడు ప్రభువు, పాదిరిగారు చెప్పినప్పుడే ప్రభువుకూడ చెప్పును. బాప్తిస్మ తొట్టిలోనికి దిగినప్పుడు నీటివలన శరీరము తడుచును. అప్పుడు పరిశుద్ధ జలముకాదుగాని పాదిరిగారు తండ్రి కుమార పరిశుద్ధాత్మ నామము అని బాప్తిస్మము ఇచ్చినప్పుడు అప్పుడు నీళ్లు పరిశుద్ధ జలమై పాపపరిహారము చేయును. మరల బైటికివచ్చి నీళ్లు పిండినప్పుడు అవి మామూలు నీళ్లే. బాప్తిస్మము ఇవ్వగానే బంధుత్వము ఏర్పడును. 1. పరలోక దూతలతోను, 2. పరలోక పరిశుద్ధులతోను 3. భూలోక విశ్వాసులతోను బంధుత్వము ఏర్పడునని ఇదివరకు నేర్చుకొన్నారు. ఆత్మలను పొందినారు. అది సంఘము వెలుపలనుండి జరిగించిరి. బాప్తిస్మము పొందుటద్వారా ఇప్పుడు సంఘములోనికి వచ్చినారు. ఉదా:- ఒకరిని ఒకరు మీకేమగునని చూపించినప్పుడు ఆయన నాకు ఏమికాడు అనిరి. నాకు ఏమికాడు అన్నవాని బంధువులలో ఒక అమ్మాయిని పెండ్లి చేసికొన్న, కొన్ని నెలల క్రితము ఏమికానివాడు బంధువుడగును. పెండ్లిచేసికొనుటకు సంబంధము అడుగుదురు. అడిగినప్పటినుండి పెండ్లి అయ్యేవరకు కొంత గడువుండును. ఆ గడువు నిజ బంధుత్వము కాదుగాని పెండ్లి అయిన తరువాత అది నిజ బంధుత్వము. అట్లే బాప్తిస్మము పొందినప్పుడు నిజ బంధుత్వము ఏర్పడును. మీరు బాప్తిస్మము పొందిన తరువాత బోధకునిలో చోడిగింజ, కుంకుడు గింజ అంత లోపము కనబడును. అప్పుడు నాకు క్రైస్తవమతము

అవసరము వద్దు అనకూడదు. మీరు బాప్తిస్మము బోధకునిబట్టికాదు. ప్రభువునుబట్టి బాప్తిస్మమును పొందినారు గనుక శ్రమలు, చిక్కులు, కలిగిన వెలుపలికి వెళ్లకూడదు. సంఘములో చేరినవారిలో లోపములున్నవి. విచారమే. అయితే ఈ లోపము గలవారు, ఇతరుల లోపములను గమనించువారు అనేకమంది బయటికి పోవుచున్నారు అది మరి విచారము.

"పై యాచారముల వలన - దైవ-భక్తి యభ్యాసమౌను= ఆ యభ్యాసము చేత - అంతరంగ సభకై యాయత్తపడుదుము - అప్పుడు - శ్రేయమౌస్థితి గల్గును" ॥ఘనపర్చుడీ॥

## II. మత్తయి. 6:33 (ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి)

రెండు ద్వారములబడి దేవుని రాజ్యములోనికి, దేవుని సంఘములోనికి రావలసినవారికి ఈ వాక్యమందు వర్తమానమున్నది. మన దేవాలయమునకున్నది ఒక ద్వారము (క్రీస్తు సంఘము - గుంటూరు). ఇక్కడ నిండిపోయినందు వలన ఒక్కొక్క ఆదివారము వెనుక ద్వారముగుండా వచ్చి ఇక్కడ కూర్చుని వింటారు. వారుకూడా ఆరాధనలో పాల్గొంటారు. ఈ వాక్యమును విడదీసికొందుము. అందులో రెండు గొప్ప మాటలున్నవి 1) దేవుని రాజ్యము 2) ఆయన యొక్క నీతి. దేవునియొక్క రాజ్యమనగా దేవునియొక్క గవర్నమెంటు. ఈ గవర్నమెంటుకు ఆయనే రాజు. అయితే దేవుని రాజ్యమెక్కడ ఉన్నది?

మన హిందూదేశమునేలే గవర్నమెంటు రాజ్యము ఢిల్లీలో ఉన్నది. వారి రాజ్యప్రదేశము హిమాలయమునుండి కన్యాకుమారి వరకు ఉన్నది. అలాగుననే దేవుని రాజ్యముకూడా ఉన్నది. ఇంగ్లాండు దేశమువారికి వారి దేశవే వారి రాజ్యము. వారు ఇతర దేశములుకూడా గెలుచుకుంటే (ఆక్రమించుకుంటే) అదికూడా వారి రాజ్యమే. అలాగే జపాను వారున్నది, జపాను రాజ్యము. వారెక్కడైనా (ఒక రాజ్యము) గెలుచుకుంటే అది వారి రాజ్యమే. ఆలాగుననే దేవుని

రాజ్యమెక్కడ ఉన్నది అనేది ఒక గొప్ప ప్రశ్న. ప్రభువు తన వాక్యములో మొదట ఆయన రాజ్యమును వెదకమన్నారు.

మనకు ఆయన రాజ్యము ఎక్కడనున్నదో తెలియకపోతే ఏలాగు? కాని ఆయన ఎక్కడున్నదో చెప్పే వెదకమన్నాడు. మత్తయి 6వ అధ్యాయములో చివరిలో రాజ్యమును గురించి చెప్పాడు, గాని అసలు 5వ అధ్యాయములోనే ఎత్తుకున్నాడు. ధన్యత వాక్యములోనే చెప్పాడు. "దీనమనస్సుగలవారు ధన్యులు దేవుని పరలోక రాజ్యము వారిది" కాబట్టి ఆయన రాజ్యము పరలోకములో ఉన్నది. మనము భూలోకములో ఉన్నాము ఆ రాజ్యము పరలోకములో ఉన్నది, గాన అది ఆయన వెదకమన్నాడు. అయితే అక్కడకు మనము ఎట్లు ఎగిరివెళ్ళాలో? ఆ రాజ్యములో ఎవరుంటారో మత్తయి 5:1-10 వరకు ఉన్నది. ఆ పరలోక రాజ్యములో ఉండవలసిన మెంబర్లు 5వ అధ్యాయములో ఉన్నారు. వారు

1. దీనమనస్సుగలవారు
2. సాత్వికులు
3. దుఃఖపడువారు (ఆత్మ సంబంధమైన దుఃఖము)
4. శుద్ధ హృదయము గలవారు
5. కనికరముగలవారు. - దేవుని రాజ్య వాస్తవ్యులు.

గనుక పరలోకరాజ్య మెంబర్లు వీరే. ఇంకా ఎవరంటే యేసుప్రభువు నామము ధరించి శ్రమలపాలయ్యే వారందరు మెంబర్లే. ఆ రాజ్య మెంబర్లే గాని ప్రస్తుతము వారు టెంపరరీగా ఇక్కడ ఉన్నారు. వారు ప్రభువు పిలిచినప్పుడు శాశ్వతముగా పరలోకమునకు వెళ్ళి అక్కడ ఉంటారు. మనముకూడా ప్రభువు పిలుచునప్పుడు అక్కడికి వెళతాము. ప్రస్తుతము ఇక్కడ ఉన్నాము, ఆ పరలోక రాజ్య వారసత్వము కొరకు ఇక్కడ తయారగుచున్నాము.

ప్రశ్న:– గుడిలో మనమందరము ఉన్నాము. పాపాత్ములమా? పరిశుద్ధులమా? ఏ మాత్రము పాపులముకాము. పాపపుటొప్పుదలలో 'మీ పాపములను నేను జ్ఞాపకము చేసికొనను' అని ఉన్నది. అంటే క్షమించివేసాడన్నమాట. ఎఫెసీ. 1:1 పౌలు ఎఫెసీ పట్టణములోనున్న క్రైస్తవులకు పత్రిక వ్రాయుచూ ఎఫెసులో నున్న క్రైస్తవులకు అని వ్రాయలేదు. పరిశుద్ధులకు అని ఉన్నది. గనుక వారందరు పరిశుద్ధులే. పరిశుద్ధులు దేవుని రాజ్యములో మెంబర్లు. మీకంటే ముందు వెళ్ళినవారు పరిశుద్ధులు కారా? పాపములో పడిపోతూ, లేస్తూ, క్షమాపణ పొందుతూ, నడుస్తూ, రాజ్యము కొరకు నిరీక్షిస్తూ, ఉన్న మనము మాత్రము పరిశుద్ధులము కామా? గనుక వారు పరిశుద్ధులే మనమును పరిశుద్ధులమే. ఇది, నమ్మే వారందరు పరిశుద్ధులే. అక్కడ వారికున్న రాజ్యము ఇక్కడ మనకు కూడా ఉన్నది.

ఆ రాజ్యానికి ఒక క్రొత్త పేరున్నది. అది "సంఘము" అని ఉన్నది. ఈ రాజ్యమైనా ఆ రాజ్యమే; ఆ రాజ్యమైనా ఈ రాజ్యమే. దేవుని రాజ్యము వెదకమన్నాడు గనుక ఆ రాజ్యకథ ఇది. మొదటి కథ. బ్రతికి ఉన్న మనము అక్కడికి ఎగిరి వెళ్ళలేము గనుక ఆ రాజ్యము ఇక్కడ ఉన్నది. ఈ దేహ రాజ్యానికి (సంఘానికి) వెలుపట పిశాచి రాజ్యము ఉన్నది. ఈలోక రాజ్యములో ఉన్నవారికి దేవుని రాజ్య సభ్యులు వెళ్ళి బోధ చేస్తున్నారు, చెప్తున్నారు గనుక ఆ బోధ (సువార్త) వినిన వారందరూ నమ్మి రావలెను. దేవునికి స్తోత్రము. వారికి ద్వారము తెరువబడినది గనుక వస్తున్నారు.

రెండు ద్వారములు మన ఎదుట ఉన్నవి. మొదటి ద్వారము గుండా బాప్తిస్మము పొంది వస్తున్నారు. వారిపేరు రిజిస్టరు అవుతుంది. ఈ ద్వారముద్వారా వచ్చారు గనుక నిత్యరాజ్యానికి తప్పక వెళ్తారు. స్థిరముగా ఉంటే ఈ రాజ్యములోనికి వచ్చినవారు వెలుపటి సంఘములోనికి వెళ్ళాలంటే వారు (లోకస్థులు) చేర్చుకోరు. వెలుపటి

సంఘములో (ఇహలోకములోనికి) చేరాలంటే బాప్తిస్మము కొట్టివేసి రమ్మంటారు. దేవుని రాజ్యం, దేవుని గుడి, దేవుని సంఘము ఇవి మూడు ఒక్కటే, స్థలాలు వేరుగాని అయితే అందరు బాప్తిస్మము పొంది ఇందులోనికి వచ్చేయాలంటే వారి బంధువులందరూ ఆటంకము పరుస్తున్నారు. అక్కడే (బయట లోకములో) ఉండి వారు ఈ రాజ్యము కొరకు నిరీక్షిస్తున్నారు. వారు తమ శరీరముద్వారా బాప్తిస్మము పొందలేదు గాని వారి హృదయములో సంఘము, రాజ్యము గుడి ఉన్నది. ఇవన్నీ వారి హృదయములోనున్నట్లు లోకమునకు తెలియదు గనుక వీరు ఈ ద్వారముద్వారా అనగా వెనుక ద్వారముగుండా వచ్చినవారని అన్నానే వారు వీరే. ఈ ఆరాధనలో పాలు పొందుచున్నారు. వీరిని చూచినవారు వీరి బంధువులైనా ఆటంకపరుస్తారంటే బాప్తిస్మము పొందలేదుగదా! పోనీలే అని అనుకుంటారు. ఇట్టివారికి బాప్తిస్మము చాలా ఆటంకముగా నున్నది.

1. ముందు ద్వారమువారు – బాప్తిస్మముద్వారా
2. వెనుక ద్వారం వారు – విశ్వాసము ద్వారా.

1వ ద్వారము గుండా వచ్చిన వారికి బాప్తిస్మము, విశ్వాసము ఉంది. రెండవద్వారముగుండా వచ్చిన వారికి విశ్వాసము ఉన్నదిగాని బాప్తిస్మము లేదు. బాప్తిస్మము పొందాలని ఆశ ఉన్నది. ఈ రెండు ద్వారములలో ఏ ద్వారముగుండా వచ్చినవారు పరలోకరాజ్య మెంబర్లు? వీరికి, వారికి మరణము వచ్చింది. చివరి సమయములో యేసు ప్రభువు ఇద్దరి దగ్గరకి వచ్చి, ఒకరితో బాప్తిస్మము పొంది వచ్చావు గనుక ఈ రాజ్య మెంబరువే అని రెండవ వారిని మెంబరువికావని అంటే న్యాయమా? మనకు ఇష్టముండునా? ఈ గొప్ప ప్రశ్న ప్రపంచమంతటిలో ఒక బంతిలాగ ఊగిసలాడుతుంది. ఆ అనుమానము పోగొట్టుటకు ఒక పేపరువేసి పంచిపెట్టారు. దానిలో బాప్తిస్మము గురించి మాత్రమే వ్రాసారు.

యేసుప్రభువు వచ్చి వీనిని పరలోకమునకు తీసికొని వెళ్తుంటే రెండవవారు మేమంతా శ్రమపడ్డాము విశ్వాసముంచాము అని గొల్లున ఏడుస్తారా? లేదా? ఈ వెనుక ద్వారము గుండా వచ్చినవారు విశ్వాసముద్వారా గుడికి వస్తున్నాము. సన్నిధి కూటములు పెట్టుకుంటున్నాము. యేసుప్రభువు కనబడుచున్నారు మాట్లాడు చున్నారు. గాని వారినే తీసికొని వెళ్తున్నాడు. మమ్ములను తీసికొని పోవటము లేదని అనుకుంటారు. యేసుప్రభువు వారిని తీసికొని వెళ్ళకపోవుట న్యాయమా? ఈ ప్రశ్నకు ఎవరు జవాబు చెప్పలేదు. కొంతమంది భక్తులకు, విశ్వాసులకు వీరిని పరలోక రాజ్యమునకు తీసికొని వెళ్తాడని తెలిసికూడా భయపడి ఊరుకుంటున్నారు. ఒక మిషనెరీ భార్య 'బ్రదర్ వారికికూడా రక్షణ ఉన్నది' అనెను. ఈ ప్రశ్నకు జవాబు మాత్రము నాకు తెలిసినంతవరకు బహు వివరముగా త్వరలో వ్రాసి అచ్చువేయించవలెనని ఉన్నది.

ప్రభువు వారిని. వీరిని చేర్చుకుంటాడు. బాప్తిస్మము తీసికొనుట ముందా? విశ్వాసముంచుట ముందా? మీరు నమ్మండి, బాప్తిస్మము పొందండి తర్వాత మీకు రక్షణ అని మార్కు 16:16లో ఉన్నదిగదా! 1. నమ్మండి అంటే రండి. 2. "ముద్ర" అనగా బాప్తిస్మము పొందండి అప్పుడు మీకు రక్షణ అని ఉన్నది. గనుక ఈ వాక్యానుసారముగా మొదటిద్వారమే మొదట నమ్మిక బాప్తిస్మము. రెండవద్వారము గుండా వచ్చినవారికి (బాప్తిస్మములేదు గాని) విశ్వాసమే ఉన్నది.

ఉద్యోగము కొరకు బాప్తిస్మము పొందాడు గాని విశ్వాసములేదు. అయితే ప్రభువునకు తెలుసు. విశ్వాసము లేకుండా బాప్తిస్మము పొందినవారు నరకానికి వెళ్తారా? లేక మోక్షమునకు వెళ్తారా? గనుక ఇప్పటికి ఆయన రాజ్యమును, నీతిని వెదకండి అని ఉన్నది. అయితే బాప్తిస్మము వట్టిదా? అంటారు. అలాగైతే

విశ్వాసము వట్టిదే అనాలి. రెండూ ఉండాలి. బాప్తిస్మము పొందాలని ఉన్నది పొందాలి. వారికి బహిరంగ బాప్తిస్మము వీరికి అంతరంగ బాప్తిస్మము ప్రభువే ఇస్తారు.

మన సంఘములో ప్రభు భోజనము ఉంది. అయితే ప్రభువు సన్నిధి కూటములో అంతరంగముగా ఇస్తున్నారు. భూలోకములో 2000 సంఘములకు ఇది క్రొత్తదే. ప్రభువు స్వయముగా సంస్కారము ఇస్తున్నారని విని పాదుర్లందరు 'ఇంకా ఎందుకు' అని ఎగతాళి చేసారు. కొన్ని సం॥ల క్రిందట ఏప్రిల్ 4వ తారీఖున సంఘము అయ్యగారిని బల్లయొద్దకు రానీయకపోగా అక్కడే కూర్చుని యుండగా ప్రభువే స్వయముగా వచ్చి ఇచ్చారు. అది విని ఈయన అబద్ధ ప్రవక్తయని అన్నారు. ఇప్పుడు సన్నిధి కూటస్తులందరూ అంతరంగ సంస్కారము తీసుకుంటున్నారు. ఏమంటారు?

గనుక విశ్వాసము ముందు, తర్వాత బాప్తిస్మము. ఆ తర్వాతే రక్షణ. బాప్తిస్మము పొందాలనే రూలు ఉంది. వెనుకనుండి వచ్చిన వీరిని చేర్చుకొనుట దానికి వ్యతిరేకమే గాని ప్రభువు చిత్తము. మనము సంతోషించాలి. అయ్యా! నేను బాప్తిస్మము పొందాను నా అన్న పొందలేదు. ఎందుకు చేర్చుకుంటారు అని తమ్ముడు అనగలడా? నేను చెప్పిన ఈ మాటలు ఎంతవరకు నిజమో పరీక్షించుటకు ప్రార్థనలోపెట్టి దేవున్ని అడగండి. సందేహము ఉన్నవారు ప్రార్థన చేయండి. నమ్మిబాప్తిస్మము పొందినవారు రక్షింపబడుదురు. నమ్మనివారికి శిక్ష విధింపబడును.

❁ **కొందరికి బాప్తిస్మము తీసికొనుటకు ఇష్టమున్నటికి, ఆటంకమునుబట్టి పొందలేరుగాని వారు అంతరంగ క్రైస్తవులుగాన వారికిని మోక్షమున్నది. ఇది విని ఎవరైనా ఉద్దేశపూర్వకముగా (అనగా బాప్తిస్మము తీసికొనుటకు ఆటంకాలు లేనప్పటికి, అవకాశమున్నప్పటికి) బాప్తిస్మము పొందకపోతే వారికి రక్షణలేదు.**

III. **పరిశుద్ధాత్మ బాప్తిస్మము:-** ప్రభువు శిష్యులు సర్వ ప్రపంచములో సువార్త సేవలో ప్రవేశింపక మునుపు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. అట్లే మనమును పొందవలెను.

**2) భాష:-** తెలియని భాషతో మాట్లాడు వరమునుగూర్చి కొరింథీ 14వ అధ్యాయములో మిగుల వివరముగా నున్నది. బైబిలులో ఏ వరమును గూర్చియు ఇంత స్పష్టముగాలేదు. మాట్లాడువారిని మనము ఆక్షేపించుట సరికాదు.

**3) ప్రభువు యొక్క రెండవరాకడ:-** దానికిముందు జరుగవలసిన గుర్తులు జరిగిపోవుచున్నవి. గనుక మనమందరమును రాకడ ధ్యానములో నుండవలెను. ఆయన ఫలాన సంవత్సరము వచ్చునని ఎవరు చెప్పగలరు. త్వరగా వచ్చుచున్నానని ప్రభువు చెప్పినారు గనుక ఆలస్యముగా వచ్చుననియు, ప్రార్థనకాలమందు వచ్చుచునే యున్నాడని పని గట్టుకొని మరొక సమయమున రాడనియు చెప్పుట వాక్యాంతరంగార్ధమునకు భిన్నముగా నుండును.

**4) దశమభాగము:-** యూదులు తమ రాబడిలో పదియవభాగము కానుకగా నిచ్చిరి. యూదులకంటె ఎక్కువమేలు పొందుచున్న మనము దశమభాగముకంటె ఎక్కువ ఇచ్చుట న్యాయమైయున్నది.

**5) కనిపెట్టు సమయము:-** ప్రార్థనలో ఆమెన్ అన్న తర్వాత వెంటనే లేచి వెళ్ళక దైవసన్నిధిలో ఇష్టము వచ్చినంతసేపు నిశ్శబ్ధముగా నుండవలెను. అప్పుడు ప్రార్థనకు ప్రత్యుత్తరము దొరకును. ఇది అన్ని మతములవారు అవలంభించిన ఎంత బాగుగానుండును!

**6) పెండ్లికుమార్తె సంఘము:-** మంచి పంట మూడు తరగతులు. ముప్పదంతలు, అరువదంతలు, నూరంతలు.

విశ్వాసులుకూడ అంతస్థులనుబట్టి తరగతులుగా నేర్పడుదురు. వారిలో మహోన్నత స్థితిగల వారే పెండ్లికుమార్తె సంఘస్థులు. వీరిలోకొందరు మృతులై ఇదివరకే పరలోకమునకు వెళ్ళిరి. శేషించియున్నవారిలో రాకడ నాటివరకు సజీవులుగా నుండువారు మహిమ మేఘమునకు ఆరోహణమై పరలోకములోని నూతన యెరూషలేములోనికి వెళ్ళుదురు. చదువరులారా! ఈ స్థితికి సిద్ధపడండి, ప్రకటన 22:17.

**7) ప్రత్యక్షత:-** ప్రత్యక్షతగల బైబిలు అను వాక్యగ్రంథము సంపూర్తియైనను, వాక్యభావమును వెల్లడించుటకు పూర్వకాలమువలె నేడును కొంతమంది విశ్వాసులకు ప్రభువు కనబడి మాట్లాడుచున్నారు. ఇదియే ప్రత్యక్షత, కోరుకొనండి. సంపాదన ప్రయత్నము చేయండి. **ఆత్మ తోడ్పడును.** (యోహాను 10:6).

షరా:- త్రియేకదేవుడు నేడు స్వయముగా చెప్పునట్టి మాటలకు తీసివేత, కల్పన అను పేర్లు పెట్టరాదు. దూరదేశమునకు వెళ్ళిన కుమారుడు ఇరువది ఏండ్లకు ఇంటికిరాగా తల్లి అతనినిచూచి, నీవు వ్రాసిన ఉత్తరములన్నిటిలో నీవు నాతో మాట్లడవలసిన విషయములు తెలిసినవి. నేను నీకు వ్రాసిన ఉత్తరములలో నీతో నేను మాట్లాడవలసిన విషయములున్నవి. గనుక నేను నీతో మాట్లాడవలసిన అగత్యములేదు అనునా? అట్లే ప్రభువు నీకు కనబడి మాట్లాడుచున్న యెడల "ప్రభువా! నీవు మాటలాడవలసినదంతయు బైబిలులో యున్నది. ఇకమాట్లాడవలసిన అవసరములేదు" అని అందువా?

**8) దైవిక స్వస్థత:-** ఔషద సహాయము లేకుండనే విశ్వాస మూలముగా యేసు ప్రభువువలన స్వస్థత నొందగల విద్య, బైబిలులోని రోగ జనస్వస్థత నొందగల విద్య. బైబిలులోని రోగ జనస్వస్థత వృత్తాంత వాక్యములలో కనబడుచున్నది. ఇది అంగీకృతమే. ఔషదములు నిషేధములుకావు. యాకోబు. 5:16.

**9) బైబిలు మిషను పోషణ.:-** ఇండియా దేశములో క్రైస్తవులతోను, ఇండియా దేశ క్రైస్తవుల కానుకలతోను, ఇండియా దేశస్థుల ఆత్మనడిపింపుతోను బైబిలు మిషను స్థాపింపబడి నడుచు చున్నది. అంతమాత్రమున ఇతర దేశములను నిరాకరించునది కాదు. ఇతరులుచేయు సహాయము నిరాకరించునదియుకాదు. ఇతరులుచేయు సత్కార్యములను మెచ్చుకొననిదియు కాదు. ఇది కాలక్రమమున ప్రవేశమగు ఆయాదేశముల పేర్లతో కలిపి (బైబిలు మిషను లండన్, బైబిలు మిషను రష్యా, బైబిలు మిషను ఆఫ్రికా, బైబిలు మిషను అమెరికా, బైబిలు మిషను ఆస్ట్రేలియా) అని పిలువబడును.

**10) భావికాల స్థితి:-** ప్రభువునకే తెలుసును. ఇది మా పేరులుగల మిషనుకాదు. ఆయన విషయములున్న బైబిలు పేరుగల మిషను. మేము స్వయముగా స్థాపించిన మిషనుకాదు. ప్రభువు స్థాపించుకున్న మిషను. ప్రభువు వచ్చి మాటలాడుచున్న మిషను. ప్రభువు మిషను. బహిరంగమునకు మేము కనబడుచున్నను అంతరంగమున ప్రభువు మాచే పనులు చేయించుచున్నారు.

**11) ప్రార్థన:-** దేవా! క్రొత్తగాలేచిన బైబిలుమిషను మీ చిత్తాను సారమైనదియైన యెడల అన్ని విషయములలో మహా అధికముగా దీనిని దీవించుము అను ప్రార్థన ప్రతి ఆదివార ఆరాధనలో చేయవలెనని మా చదువరులకు విన్నవించుచున్నాము.

**12) శుభవాక్యము:-** సత్యాపేక్షతో దీనిని చదువువారికిని చదివి ప్రార్థించువారికిని, తెలిసికొని అనుసరింపయత్నించువారికిని, ఇతరులకు ప్రచురించు వారికిని దేవుని స్తుతించువారికి, త్రియేక దేవుడు జ్ఞానాభివృద్ధిని, విశ్వాసాభివృద్ధిని, ఆరోగ్యాభివృద్ధిని, జీవితోద్దేశసిద్ధిని అనుగ్రహించునుగాక!

**13) మా మనవి:-** ఈ పుస్తకములోని విషయములెంతవరకు నిజమో తెలిసికొన గోరువారు ప్రార్థనలో ప్రభువును అడగండి. తెలియజేయువరకు అడుగుచూనే యుండండి తప్పకుండా ప్రభువు మీకు తెలియజేయునని మా నమ్మిక. మీ జ్ఞానముచెప్పగల దానికన్నను, మీ మనస్సాక్షి చెప్పగల దానికన్నను మనుష్యులు చెప్పినదానికన్నను, పరిస్థితులు చెప్పగలదానికన్నను, బైబిలు చెప్పునదియు, ప్రభువు చెప్పునదియు గొప్పది.

కం॥ వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనే వేగపడక । వివరింపదగున్।
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడె పో నీతిపరుడు । మహిలో సుమతీ।

ఇది ఒక హిందూమత కవీశ్వరుడు వ్రాసిన నీతివాక్యము. ఈ నీతి వాక్యమును క్రైస్తవులమైన మనమును అనుసరింప తగినదే.

'సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుడి' 1థెస్స. 5:21.

**14) ఏర్పాటులు:-** ఇతర మిషనుల బోధలు, సిద్ధాంతములు, కట్టడములు, ఆచారములు, పనులు, పనిపద్ధతులు మొదలైనవి. వీటిలో మాకు అనుగుణ్యముగా నుండునవన్నియు అవలంభింతుము. మా ఏర్పాటులకు తోడు. ఇతర మిషనులద్వారా దేవుడు నెరవేర్చిన గొప్ప పని నిమిత్తమై మేము కృతజ్ఞులమై యున్నాము ॥మూలవాక్య పద్ధతి॥

1. బైబిలు ఏమి చెప్పుచున్నదో అది చేయవలెను.

2. దేవుడేమి చెప్పునో అదియు చేయవలెను.

మూలవాక్య పద్ధతి క్రమము :

(1) దేవుడేమి చెప్పెనో అది చేయవలెను. అని ఆది. 31:16లో నున్న విషయము.

(2) యేసుప్రభువు ఏమి చెప్పునో అది చేయవలెను అని యోహాను 2:5లో నున్న విషయము.

(3) సంఘములతో పరిశుద్ధాత్మ ఏమని చెప్పునో అది వినవలెను. ప్రకటన 2:7లోనున్న విషయమును విశ్వాసులు ధ్యానించవలెను.

చెప్పుట, చెప్పుట, చెప్పుట అని వ్రాయబడిన మాటను గుర్తించండి. చెప్పుట అనుక్రియ స్వరమును జ్ఞాపకము చేయును. చెప్పుట అనగా స్వరముతో మాట్లాడుట అని అర్థము. పాత నిబంధన కాలములో దేవుడైన యెహోవా మాట్లాడెననియు, సువార్తలలో దేవుడైన క్రీస్తుప్రభువు మాట్లాడెననియు, నమ్మినట్టి విశ్వాసులు తమ విశ్వాసమును సంపూర్తిచేసికొనుటకై నేటి కాలములో పరిశుద్ధాత్మ తండ్రి సంఘములతో మాట్లాడు చున్నాడనియు ఎందుకు నమ్మరాదు? ప్రకటన 3:6. మనమున్నది సంఘకాలము గనుక ఆయన వ్రాత వాక్యమును వివరించుచూ మనతో మాట్లాడవలసినకాలమని గ్రహించుకొనండి. నా విషయములు పరిశుద్ధాత్మ మీకు బోధించును అని ప్రభువు చెప్పలేదా! యోహాను 16:13-14. బైబిలు వాక్యములకు గ్రంథకర్తలు (వ్యాఖ్యానకర్తలు) వ్రాసిన అర్థములకంటెను, బోధకులు ప్రసంగ పీఠములలో వివరించునట్టి అర్థములకంటెను పరిశుద్ధాత్మ చెప్పునట్టి అర్థము ఎక్కువ విశ్వసనీయము కాదా?

"యెహోవా హస్తము ఏలీయాను బలపరుపగా అతడు నడుము బిగించుకొని ఆహాబుకంటె ముందుగా పరుగెత్తికొని పోయి యెజ్రెయేలు గుమ్మము నొద్దకు వచ్చెను" 1రాజులు 18:46. మరనాత.

Bible Mission HQ Guntur

# 10. బైబిలు మిషను ఆహ్వానము

1. 'దేవుని వెఱ్ఱితనము మనుష్యజ్ఞానముకంటె జ్ఞానముగలది' (1కొరింథి 1:25).

2. 'దేవుని మాట వినుటకంటె మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పుడి. మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేము' (అపో. కార్య. 4:19-20).

3. 'పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్థకమగును' (1కొరింథీ 13:10).

4. 'సమస్తమును పరీక్షించి మేలైనదానిని చేపట్టుడి' (1థెస్స. 5:21).

యేసుక్రీస్తు ప్రభువునుబట్టి రక్తబంధువులగు క్రైస్తవ ప్రియులారా! క్రీస్తు ప్రభువుయొక్క జీవము మీలో స్థిరపడునుగాక!

ఒక మనవి:- 1938 జనవరిలో దేవుడు నాకు రాజమండ్రిలో బైబిలు మిషనును బైలుపరచి నేటివరకు సాగించుచున్న విషయమును మీరు మీ జ్ఞాన శక్తికొలది పరీక్షింపవలసినదని కోరుచున్నాను. మీకు అందని విషయములు దేవుని నడిగి తెలిసికొనండి. కాని మేము అడుగునది లేదు, అడిగిన యెడల ఆయన చెప్పునది లేదని నిరాశపడకండి. దేవుడు మానవులకు చెప్పవలసినవి బైబిలులో వ్రాసిపెట్టి ఉంచినాడు. కనుక ఆయనను అడుగుట శోధించుటయై యుండునని మీరనుకొన్న యెడల మీరు ఇదివరకు చేసియున్న వ్యాఖ్యానములు, ప్రసంగములు అన్నియు మానివేయవలసి యున్నది. 'నా నామమునుబట్టి మీరు ఏమి అడిగినను నేను చేతునని' ప్రభువు చెప్పినాడు గనుక మనము ఏదైనను అడుగవచ్చును (యోహాను 14:14) లోకములో ఏదైన ఒక క్రొత్త సంగతి జరిగినయెడల దానిని గురించి ప్రార్థింపకుందురా? ప్రార్థింతురు. కనుక దేవా! బైబిలు మిషను నీవు బైలుపరచినదా? ఇన్ని మిషనులుండగా ఇదెందుకు? అని

అడగండి. ప్రార్థనకు జవాబు ఇచ్చునని బైబిలే మనకు చూపుచున్నది గదా! ఇట్టి ప్రశ్నలు అడిగినయెడల ప్రభువు జవాబియ్యడా? జవాబు వచ్చువరకు కనిపెట్టండి. మా మిషనుపనికి బైబిలు మిషను పని ఆటంకముగా నున్నదని తోచినవారందరు ఆటంకమును తొలగించుకొనుటకు ప్రార్థించి తీరవలయునుగదా! బైబిలు మిషనువారు *ఒక గ్రామమునకు వెళ్ళి బోధించినట్టే బోధించి మా మిషనులోనికి రండని పిలుతురు. ఇది సరికాదుగదా అని కొందరు ఆక్షేపించు చున్నారు. పిలువని యెడల బోధించిన ప్రయోజనమేమి?* క్రైస్తవ మిషనులన్నియు ఇతరులను పిలుచుటలేదా? మరియు ఒక మిషనులోనుండి కొందరు మరియొక మిషనులోనికి వెళ్ళుటలేదా? మేము ఒక మాట చెప్పుచున్నాము. అదేదనగా మీరు మా బోధ పూర్తిగా 'వినండి, పరీక్షించండి, మీ జ్ఞానమునకు ,మనస్సాక్షికి సరిపోయిన యెడల మేము చెప్పకపోయినను మీరే వత్తురు. రావచ్చును. అయితే మాకు ప్రభువు ఏలాగు చెప్పునో మీకును అలాగే చెప్పినయెడల తప్పకుండ వచ్చి తీరవలెను. *ప్రభువు మీకు స్వయముగా చెప్పగా వచ్చిన యెడల మీరు ఎంత ధన్యులు?* ఇక ఎప్పటికిని *తిరిగిపోరు. జ్ఞానమునుబట్టి వచ్చిన యెడల లేక చెప్పిన మాటలను బట్టియు లేక బైబిలు మిషనులోని నామక క్రైస్తవులను బట్టియు వచ్చిన యెడల ఎప్పటికైన తిరిగిపోదురు.* బైబిలు మిషనును దేవుడు బైలుపరచిన మిషను గనుక అందరును భక్తాగ్రేసరులై యుండవలసినది. ఎందుకులేరని అడుగుదురేమో! అనేక మిషనులున్న క్రైస్తవమతము అన్ని మతములకంటె ఎక్కువైన మతమనియు, క్రీస్తు తప్ప వేరొక రక్షకుడు లేడనియు క్రైస్తవులమైన మేము బోధించుచున్నాము గదా! (కార్య. 4:12) దీనిలో నామక క్రైస్తవులు లేరా! అలాగే మా మిషనులోకూడ నామక క్రైస్తవులు ఉన్నయెడల ఏమి ఆశ్చర్యము? వారు క్రమముగా మారవచ్చును. కొందరు మరణ సమయములో మారుదురు.

బైబిలు మిషనుయొక్క మూల సిద్ధాంతములలో నొకటి ఏదనగా! 'ఆయన మీతో చెప్పునది చేయుడి' అనునది (యోహాను 2:5) ఈ రెండు వేల ఏండ్లనుండి బోధకులు చెప్పినట్టియు వ్రాసినట్టియునైన బైబిలు వాక్యార్థములు విన్నాము. కాని ఆ అర్థములు ఒకదానికొకటి సరిపోకుండా ఉన్నందున నేటి క్రైస్తవ సంఘము 850 మిషనులైనది. కనుక ఇప్పుడు మనము వాటి అర్థము దేవుని నడిగి తెలిసికొనవలెను. అప్పుడు ఆయన చెప్పును. ఆయన చెప్పునదే మనము చేయవలెను. బోధకులు చెప్పిన వాటిలో తప్పులున్న యెడల ఆయన దిద్దును. అప్పుడు అన్ని మిషనులు ఏక సిద్ధాంతము ననుసరించును. వాదములుండవు. ఒకవేళ ఉన్నయెడల మరల మరల ప్రభువును అడుగుచూనే యుండవలెను. వేదాంత పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయుని మాటిమాటికి అడుగుటలేదా? ఆయన చెప్పుట లేదా? 'నాయొద్ద నేర్చుకొనుడి' అని ప్రభువు చెప్పలేదా? (మత్తయి 11:29) చెప్పిన ఆయనను అడిగిన యెడల ఎందుకు చెప్పడు? పాత మిషనులో ఉండిపోవలెను. కాని క్రొత్త మిషను అగు బైబిలు మిషనులోనికి ఎందుకు వెళ్ళవలెనని అందురేమో! మన దేశమునకు 1853వ సం॥న వచ్చిన రైలుబండిని తర్వాత వచ్చిన బస్సును, సైకిలును, విమానమును మనవారు ఉపయోగించుకొనుటలేదా? బజారులోనికి దూరమునుండి క్రొత్త క్రొత్త సామానులు రాగా మనము వెళ్ళికొనుక్కొనుట లేదా? అలాగే క్రొత్తగా వచ్చిన బైబిలు మిషనును ఎందుకుగైకొనరాదు? ప్రతి మిషనులోని అభిమానులకు నిష్ఠపరులకు ఒక భయముండవచ్చును. *తీరా మేము ప్రభువు నడుగగా ఆయన మీరు బైబిలు మిషనులోనికి వెళ్ళవలెనని చెప్పినయెడల మనకు తప్పదేమో? వెళ్ళనియెడల ఆయన మనతో చెప్పునది చేయని నేరస్థుల మగుదుము.* ఇట్టి భీతి మా పత్రికలు చదువు వారందరికిని కలుగక మానదు. అన్ని మిషనులు ఇతర మతస్థులను పిలుచుచున్నట్లు మేమును ఇతర మతస్థులను పిలుచు

చున్నాము. పైగా మేము మా సోదర మిషనులన్నిటిని పిలుచుచున్నాము. నమ్మినను, నమ్మకపోయినను మిమ్మును వారిని పిలుచుట మా విధి. ఇదివరలో నేను ప్రచురించిన కొన్ని మాటలు మరలా ప్రచురించు చున్నాను. అవేవనగా- 1) నీవు ఉన్న లూథరన్ మిషనును విడిచిపెట్టవలెను. 2) యువరాజువలె బైటికి వచ్చివేయవలెను. 3) బైబిలు మిషనును పైకి ఎత్తి చూపింపవలెను. 4) ఇక ముందునకు *ప్రపంచమంతటికిని సువార్త నందించు విషయములో ఇండియా మూల* స్థానమగును. ఇట్టిమాటలు మిషనరీలకు దేశీయ బోధకులకు, ఇవాంజిలిష్టులకు, కేటకిష్టులకు, సామాన్య క్రైస్తవులకు, నామక క్రైస్తవులకు ఇతర మతస్థులకు దేవుడు స్వయముగా కనబడి చెప్పిన యెడల ఏమి చేయుదురో చెప్పండి. యేసుప్రభువును నీటిమీద చూచిన శిష్యులు భూతమని తలంచినట్లు కొందరు తలంచుదురు. మీరు మా మిషనులోని ప్రతివారి ప్రవర్తనను పరీక్షించండి అని యే మాత్రమును చెప్పలేము కాని, సిద్ధాంతములు పరీక్షించండి అనియు, క్రీస్తుప్రభువు *నడిగి తెలిసికొనండి అనియు మాత్రమే చెప్పగలము. 'దేవా! నాకు కనబడుము, నాతో మాటలాడుము; దేవా! అందరికిని కనబడుము, అందరితోను మాటలాడుము.'* ఈ నాలుగు మాటలు నేను తరచుగా ప్రచురించినాను. ఇవి అన్ని మతములవారు వినవలసినమాటలు. ఈ నా చిన్ని సువార్త నేను భూదిగంతముల వరకు పంపుదును, లేదా నా అనుచరులైనా పంపుదురు. మా మిషను బైలుపడుటను గురించి అన్ని మిషనులవారు, అన్ని మతములవారు పరీక్షించుటకు నేను 19సం॥ల గడువిచ్చి ఈ పత్రిక ప్రచురించుచున్నాను. ఇది సాక్ష్యార్థపత్రిక. దేవుడు తన చిత్తమును బహిరంగముగ బైలుపరచిన బైబిలులో వ్రాయించిన సాధనములు ఏవనగా: ఆయన బహిరంగముగా కొందరికి కనబడుట, కొందరితో స్వరముతో మాట్లాడుట, కొందరితో గాలిలో కూడ వ్రాత వ్రాసి చూపించుట, కొందరికి స్వప్నంలో కనబడి చెప్పుట, కొందరికి

దర్శనములో కనబడిచెప్పుట ఇవిగాక ఇంకను అనేక సాధనములు గలవు. బైబిలు మిషనువారి బోధలు విన్న యెడల మా మిషనుల పేరులు మార్చుకొనవలెనేమో అని కొందరు భయపడుదురు. ఇతర మతస్థులు మన మతములోనికి వచ్చునప్పుడు తమ మతము పేరును మార్చుకొనుట లేదా? ఒక మంచిపని చేయుట ఆక్షేపణ కాదుగదా! అన్ని మిషనులవారు మా బోధ విన్నయెడల మిషనుల పేరులు మార్చుకొనకుండనే, సిద్ధాంతములు తప్పకుండా మార్చుకొనవలెను. బాప్టిస్టు మిషనువారు, బాప్టిస్టు బైబిలు మిషననియు, లూథరన్ మిషనువారు, లూథరన్ బైబిలు మిషననియు మార్చుకొనవచ్చును. అవియైనను ప్రభువు చెప్పిన యెడల మార్చుకొనవలెను. నాకు మరియొక సలహా ఉన్నది. వీలైనప్పుడు తెలుగు జిల్లాలలోని ప్రతి మిషనులోనుండి ఇద్దరేసి ప్రతినిధులను పిలిపించి స్నేహభావముతో వివాదములు లేకుండ బైబిలు మిషను విషయములన్నియు చెప్పవలెనని. అప్పుడు ఆ సభ సాక్ష్యార్ధ సభయైయుండును. చదువరులారా! నేను మీ క్రైస్తవమత సంఘస్థుడను. మీవలెనె భక్తిగా నడచుకొనుటకు శక్తికొలది ప్రయాస పడుచున్నాను. నేను మీ దేశస్థుడనే. నేను మీ జత పనివాడనే. మీ సోదరుడనే కనుక నా మనవులు మీ ప్రార్ధనలో పెట్టిన యెడల నాకు గొప్పమేలు చేసినవారగుదురు. నేను దేవుడు బైలుపరచినది అపార్ధము చేసుకొన్న కీడు తొలగించి నాకు మేలుచేసిన వారగుదురు. నేను ఇట్టి పత్రిక వ్రాసినందున కోపగించుకొనక మీరు బ్రతికినంతకాలము అనుదినము నా క్షేమము కొరకు ప్రార్ధించుటకు శక్తిగలవారై యుందురుగాక! కోపము, అపార్ధము ఉన్నయెడల మీరు ప్రార్ధింపలేరు.

మా బోధలు పరీక్షించుటకు మమ్మును పిలువండని మేము మిషనెరీలనడుగగా వారు పిలిచిరి. మీ బోధ బైబిలులో ఉన్నది. కాని సిద్ధాంతములలో లేదని వారు చెప్పిరి. అలాగైన ఇప్పుడు చేర్చండి.

మిషనంతటికి బోధించుటకు సెలవియ్యండని చెప్పితిమి. వల్లపడదు. మీరు వేరై ఒక సంఘముగా ఏర్పడి బోధించుకొన్న యెడల మేము ఇతర మిషనులను గౌరవించునట్లు మిమ్మునుకూడ గౌరవింతుమని చెప్పిరి. నేను లూథరన్ మిషను సభ్యత్వమునకు ఫిబ్రవరిలో రిజైను పెట్టితిని. వారు జవాబు చెప్పనందున నేను ఏప్రిల్‌లో సంఘమాచరించు ప్రభువు భోజన సంస్కారమునకు సిద్ధపడి గుడికి వెళ్ళితిని. వారు నన్ను బల్లయొద్దకు రానీయలేదు. నేను సిగ్గుపడలేదు. నా స్థలములోనే ఉంటిని. ప్రభువు వచ్చి నాకు రొట్టె ద్రాక్షారసము ఇచ్చిరి. ఇది బహిరంగ దర్శనము. కొన్నాళ్ళకు మా మిషను గవర్నమెంటులో రిజిష్టరైనది. ఇది ఆహ్వాన పత్రిక కనుక మొదటి పంక్తులలో చరిత్ర విశేషించి వ్రాయలేదు. సిద్ధాంతములుకూడ పేర్కొనలేదు. పనిలో గలిగిన మంచి ఫలితములు ఉదహరింపలేదు. నేటివరకు ప్రభువు మాతో మాటలాడుచున్న మాటలుకూడ ప్రచురింపలేదు.

**ప్రశ్నలు జవాబులు :**

మేము బైబిలు మిషనును బైలుపరచినందున మా మీద అనేకులు అనేకమైన ప్రశ్నలు వేయుచున్నారు. కొన్ని ఈ దిగువను ప్రకటించుచున్నాను.

1. ప్రశ్న:- బైబిలు మిషను అనుమాటలు దేవుడు గాలిలో వ్రాసి చూపించెనని మీరు ప్రకటించినారు గదా! అలాగైన మీ మిషను చెత్తవలె గాలికి కొట్టుకొని పోవును గదా!

జవాబు: గాలి ఎవరియొద్దకు వెళ్ళునో మా మిషనుకూడ వారియొద్దకు వెళ్ళక మానదు. ఎందుచేతననిన ఇది దేవుడు స్వయముగ బైలుపరచిన మిషను. గాలి కూడ దేవుడు బైలుపరచిన దానమే.

2. ప్రశ్న:- మిమ్మును పైకి తీసికొనివచ్చిన అమెరికన్ ఇవాంజిలికల్ లూథరన్ మిషనును విడిచిపెట్టుట న్యాయమా?

జవాబు: నేను ద్వేషభావముచేత గాని, నాకు ఏదో ఒక కష్టము కలుగుట వలనగాని, ఏదో ఒక నేరస్థాపన ఉండుటవలనగాని, పోషణ చాలక పోవుటవలనగాని, విడిచిపెట్టియుండిన యెడల గొప్ప దోషమే. కాని దేవుడు వచ్చివేయుమని చెప్పగా వచ్చివేయుట న్యాయమే గదా! మిమ్మును దేవుడు రమ్మనిన రారా యేమి? నన్ను గౌరవముతోను, ప్రేమతోను చూచుచున్న మిషనును విడిచిపెట్టుట ఎంత కష్టమైయుండును? లూథరన్ మిషనునకు నేను నిత్యము కృతజ్ఞత గలవాడనై ఉన్నాను. బోధకుడగు నా జనకుడును, ప్రార్థనాపరురాలగు నా జననియును ఉండి గతించిన మిషనును విడిచిపెట్టుట సుళువైన పనికాదు గదా!

3. ప్రశ్న:- వృద్ధాప్యమును బట్టియు, ఊహలను బట్టియు మీకు తప్పుడు దర్శనములు కలుగవచ్చునని కొందరి యభిప్రాయము.

జవాబు: అందుకే గదా దేవుని నడిగి తెలిసికొనండని మొదటి నుండియు మీకు మొరపెట్టుచున్నాను. నా ఊహ తప్పు అయిన యెడల నీ ఊహకూడ తప్పని నేను చెప్పవలసియుండును.

4. ప్రశ్న:- అన్ని దర్శనములు నిజమా?

జవాబు: నేడు మా మిషనులో దర్శనవరములు గలవారనేకులు గలరు. వారు పడుచువారే. ముఖ్యముగా ఈ మధ్య లేచిన సన్నిధి కూటస్థుల దర్శనములు నా దర్శనములను స్థిరపరచుచున్నవి. మీకు ఓపిక ఉన్నయెడల గుంటూరు, బెజవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, కాకినాడ అను పట్టణములలో అనుదినము జరుగుచున్న సన్నిధికూటములకు వెళ్ళి మీ ఇష్టమువచ్చిన మత సంబంధమగు ప్రశ్నలు వేయవచ్చును. ఈ కూటములకు ప్రభువు, పరలోక పరిశుద్ధులు, దేవదూతలు, వచ్చుచున్నారు. మాటలాడుచున్నారు. భూలోక విశ్వాసుల ఆత్మలుకూడ వచ్చుచున్నవి. ప్రభువు తీసికొని వచ్చుచున్నారు. పిశాచములనుకూడ అప్పుడప్పుడు

రానిచ్చుచున్నారు. దర్శనములలో వినబడు మాటలు కూటస్థులు వ్రాసికొనుచున్నాడు. ఎట్టి పాపులైన ఏ మతస్థులైన దైవసన్నిధి కూటము పెట్టుకొనవచ్చును.

5. ప్రశ్న:- దర్శనములు కలుగుచున్నవని ఇతర మతస్థులుకూడ చెప్పుచున్నారుగదా?

జవాబు: ఇది నిజమే. వారు దర్శనములో కనబడిన వారియొద్దకు జీవాంతమందు వెళ్ళుదురు. క్రీస్తునొద్దకు వెళ్ళరు.

6. ప్రశ్న:- శక్తిపూజ గలవారికి దర్శనములు గలవని చెప్పుచున్నారు. ఇది ఏమి?

జవాబు: ఇదికూడ నిజమే. శక్తిని పూజించుచున్నారు గనుక వచ్చి కనబడును. శక్తిపూజ కూడదని బోధించు బైబిలు వచనము లనేకములు గలవు. మోషే సర్పమును చేసినప్పుడు మాంత్రికులుకూడ సర్పములను చేసిరిగదా! పౌలు బోధలు విని మాంత్రికులు తమ గ్రంథములు కాల్చివేసి క్రీస్తు భక్తులైరి. 'కాబట్టి మోషే అహరోనులు ఫరో యొద్దకు వెళ్ళి యెహోవా తమకాజ్ఞాపించినట్లు చేసిరి. అహరోను ఫరో యెదుటను అతని సేవకుల యెదుటను తన కఱ్ఱను పడవేయగానే అది సర్పమాయెను. అప్పుడు ఫరో తన విద్వాంసులను, మంత్రజ్ఞులను పిలిపించెను. ఐగుప్తు శకునగాండ్రుకూడ తమ మంత్రములచేత అలాగే చేసిరి. వారిలో ప్రతివాడును తన కఱ్ఱను పడవేసినప్పుడు అది సర్పమాయెనుగాని అహరోను కఱ్ఱ వారి కఱ్ఱలను మ్రింగివేయగా యెహోవా చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను. గనుక అతడు వారి మాట వినకపోయెను." నిర్గమ 7:10-13.

క్రీస్తు బోధకుడైన పౌలుచేసిన బోధనాద్భుతములు చూచి మాంత్రికులు తమ పుస్తకములను కాల్చివేసిరి. కార్య. 19:19.

ఒక మతమునుగాని, ఒక మనుష్యునిగాని తృణీకరింపరాదు. ప్రతిమతములోను దైవకళలు, నీతిబోధలు, మంచి ఆచారములు, సజ్జన

చరిత్రలు ఇట్టివి గలవు. కాని క్రీస్తులేడు, ఇది సాధు సుందరసింగు చెప్పినమాట.

7. ప్రశ్న:- దర్శనాదులు బైబిలు కాల వృత్తాంతములు. నేటి కాల వృత్తాంతములు కావుకదా?

జవాబు: క్రీస్తుప్రభువు నిన్న నేడు నిరంతరము ఒకలాగే ఉన్నాడని బైబిలులో లేదా? (హెబ్రీ 13:8). బైబిలులో ఉన్న అద్భుతములన్నియు అవసరమునుబట్టి నేడుకూడ జరుగక మానవు. విశ్వాసులు క్రీస్తుప్రభువు చేసిన క్రియలకంటె ఎక్కువ క్రియలు చేయుదురని ప్రభువు చెప్పిరి. (యోహాను 14:12).

8. ప్రశ్న:- బల్లయొద్దకు మిమ్మును మిషనెరీవారు ఎందుకు రానీయలేదు.

జవాబు: నేను సభ్యత్వమును వదులుకొన్నందువలన రానీయలేదు.

9. మీరు సభ్యత్వము వదులుకొన్నారుగదా! బల్లయొద్దకు రానిత్తురని ఎందుకనుకొన్నారు?

జవాబు: బల్ల ప్రభువు బల్ల, అందుచేత సిద్ధపడియుంటిని, ఏ మిషను వారినైన రానిత్తురు. కనుక నన్నుకూడ రానిత్తురని తలంచితిని. రిజైను చేసినప్పటికిని వారు జవాబు ఇవ్వలేదు. అందుచేత నేను ఇంకను లూథరు మిషనులోనే ఉన్నట్టు భావించితిని. సంఘము ఇయ్యలేదు. కనుక సంఘాధిపతియైన ప్రభువు ఇచ్చి సంతుష్టి పరచెను. ఆయనకే స్తోత్రము.

10. ప్రశ్న:- లూథరన్ మిషనువారు మీకు ఆర్డినేషను ఇచ్చెదనన్నప్పుడు ఎందుకు పుచ్చుకొనలేదు?

జవాబు: నిర్వహింపలేనని పుచ్చుకొనలేదు.

11. ప్రశ్న:- మీకు ఆర్డినేషను లేనిదే ఒకరికి ఆర్డినేషను ఇచ్చిరని తెలిసినది. ఇట్లు ఇచ్చుట సరియా?

జవాబు: బహుశ 1917లో నేను ఒక ప్రార్థనాకూటములో ఉండగా త్రియేక దేవుడు వచ్చి నాకు ఆర్డినేషన్ ఇచ్చెను. అందుచేత నేను పాదుర్లు లేని సమయమందు ఆర్డినేషను. బాప్తిస్మము, ప్రభువు భోజన సంస్కారము జరుపవచ్చును.

12. ప్రశ్న:- ఆ ఆర్డినేషను జరిగిన కూటములోనివారు ఎవరైనా ఇప్పుడు ఉన్నారా?

జవాబు: లేరు. ఈ మార్చిలో ఒక వృద్ధుడు రక్షణ కర్త అని చెప్పి చనిపోయెను. కాని ఆయన 1938లో నాకు వ్రాసిన ఉత్తరములో ఆ కూటముయొక్క మినిట్సు ఉన్నవి అని నేను అప్పుడే మా పత్రికలో ప్రచురించితిని.

13. ప్రశ్న:- యూరఫ్, అమెరికావంటి క్రైస్తవ దేశములలో గాక ఇండియా దేశములోనే దేవుడు ఎందుకు బైబిలు మిషనును బైలుపరచెను?

జవాబు: ఇదికూడ దేవుని అడిగి తెలిసికొనవలసినదే.

'ప్రభువా! నీవు జ్ఞానులకును, వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను. అవును తండ్రీ, ఈలాగు చేయుట నీ దృష్టికి అనుకూలమాయెను' (మత్తయి 11:25,26)

'మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి' మార్కు 16:15.

తెల్లదొరలకు దేవుడు బైబిలు మిషనును బైలుపరచి యుండినయెడల యీ పదునెనిమిది ఏండ్లలో సర్వలోకమునకు వెల్లడిచేసి యుందురు. కాని అది దేవుని పద్ధతికాదు. క్రైస్తవమతము వ్యాపించుటకు కావలసినంత సొమ్ము పోగుచేయగల ఒక మిషనుగాని, ఒక సమాజముగాని, ఒక వ్యక్తిగాని నేటివరకు పుట్టలేదు.

14. ప్రశ్న:– బైబిలు మిషనులోనికి రానివారికి రక్షణ దొరకదా? మోక్ష ప్రవేశము కలుగదా?

జవాబు: రక్షణ మిషనునుబట్టికాదు. విశ్వాసమునుబట్టి, అన్ని మిషనులలో రక్షణ బోధ గలదు. మరియొక సంగతి. ఇతర మతములలోనివారు సిలువమీద నేరస్థునివలె మారిన యెడల క్రీస్తు ప్రభువు వారిని మోక్షములో ప్రవేశపెట్టకమానరు.

15. ప్రశ్న:– ఎంతోమంది భక్తులుండగా దేవుడు మీకే ఎందుకు బైబిలు మిషనును బైలుపరచెను?

జవాబు: అది నన్నడుగవలసిన ప్రశ్నకాదు. దేవునిని అడుగండి. 1) ముగ్గురు కుమాళ్ళుండగా దేవుడు ఎందుకు నోవహునకు నావ నిర్మాణకార్యమును అప్పగించెను? 2) యాకోబునకు పన్నెండుమంది కుమాళ్ళుండగా దేవుడు ఎందుకు యూదాను క్రీస్తునకు పితామహునిగా నేర్పర్చెను? 3) అనేకమంది కన్యలు ఉండగ ప్రభువు జన్మించుటకు దేవుడు ఎందుకు మరియమ్మను ఏర్పర్చెను? అన్నా ను ఎందుకు ఏర్పరుపలేదు? 4) పన్నెండు మంది శిష్యులుండగా, ఇతరులు (అన్యులు) యూదులతో సమాన వారసులు అను సంగతి దేవుడు అపోస్తలుడైన పౌలునకే ఎందుకు బైలుపరచెను? 5) అనేకమంది విద్యార్థులుండగా బైబిలు అచ్చునకిచ్చుటకు దేవుడు ఎందుకు మార్టిన్ లూథరును ఏర్పర్చెను?

ఇట్టి ఉదహరణములు బైబిలులో అనేకములు గలవు. నా యోగ్యతనుబట్టికాదు. ఆయన చిత్తమునుబట్టి నన్ను బైబిలు మిషను ప్రత్యక్షతకు ఏర్పరచుకొనెను.

16. ప్రశ్న:– బైబిలు మిషనునకు పోషణాధారములేదు. కనుక తక్కిన మిషనులవలె వ్యాపించునా?

జవాబు: ఇదికూడ ప్రభువు నడుగవలసిన ప్రశ్నయే. నాకు ఇట్లు తోచుచున్నది. దేవుని వాక్యము నరుల భాషలోనికి రాకముందు అనాదియందే ఉన్నది. భాషలోనికి వచ్చిన తరువాత వ్రాతలోనికి వచ్చినది.ఆ తరువాత అచ్చులోనికి వచ్చినది. ఇది కడవరకు అనగా లోకాంతము వరకు ఉండును. అట్లే బైబిలులోనున్న క్రీస్తుప్రభుని చరిత్రకూడ ఉండును. చరిత్రతో పాటు ఆయనను గురించిన సువార్త ప్రకటనకూడ ఉండును. లోకాంతమైన తర్వాత పరలోకములో క్రీస్తుప్రభువు, ఆయనను భూలోకములో ప్రకటించిన వారును, అట్టి ప్రకటనకు ఆధారమైన బైబిలు ప్రమేయము ఉండవచ్చుననుట సబబుకాదా! అలాగైన యెడల బైబిలుమిషనుకూడ ఉండును. బైబిలుయొక్క సిద్ధాంతముల ననుసరించువారేగదా పరలోకములో నుండువారు. ఆ సంఘము బైబిలు మిషనుకాక ఏ వ్యాఖ్యాన మిషనై యుండును?

17. ప్రశ్న:- ఈ లోకములోనున్న మిషనులు అక్కడకూడ ఉండునా?

జవాబు: భిన్నబోధలు ఉండవు గనుక సంఘము చీలికలైన మిషనులు కూడ ఉండవు.

18. ప్రశ్న:- అలాగైన మీ బైబిలు మిషను ఏలాగు ఉండగలదు?

జవాబు: ఇది స్వయముగ దేవుడే బైలుపరచిన మిషను గనుకను. ఏక సిద్ధాంతముగా బైలుపడిన మిషను గనుకను అందరి నిమిత్తమై బైలుపరచిన మిషను గనుకను, దేవుడే స్వయముగా బైబిలు మిషను అను పేరుపెట్టినాడు గనుకను ఇది పరలోకములోకూడ నుండగలదు. పరలోకములో నున్నవారందరు బైబిలు సంఘములోనివారేగదా! సంఘము అనుమాటకు బదులుగా మిషనులకు ఉన్న చీలికలను అర్థము రాదు. ఇది చీలికకాదు. ప్రత్యేక సంఘము. దీనిని మరింత

వివరముగా చెప్పుచున్నాను. బైబిలు మిషను మెంబర్లు ఎవరనగా, 1) భూలోకములోనున్న బైబిలుమిషనులోని ఏవిశ్వాసులు, 2) భూలోకములోని ఇతర మిషనులలోనున్న బైబిలు మిషను విశ్వాసులు, 3) భూలోకములోనున్న ఇతర మతములలోని బైబిలుమిషను విశ్వాసులు, 4) సృష్ట్యాధి మొదలుకొని రెండవ రాకడవరకు చనిపోయిన భక్తులు అనగా పరలోక వాస్తవ్యులైన పరిశుద్ధులు, 5) పసితనమందే చనిపోయిన పిల్లలందరు, 6) రెండవ రాకడకు ఆరోహణము కానైయున్నవారు. 7) అటు తరువాత లోకాంతము వరకు ఉండి ఎప్పుడో ఒకప్పుడు మారినవారు, (అన్ని మతములలో నున్న పసిపిల్లలందరు రాకడనాడు ఆరోహణమగుదురు). ఎందుకనిన వారు దేవునికి అపకీర్తి కలిగించు పనులు చేయలేదు గనుక వారు భూలోకములోని ఏ మతములోను చేరలేదు. కనుక సృష్టికర్తయైన దేవునికి మాత్రమే సంబంధించి యున్నవారు. ఏలూరులో ఒక క్రైస్తవురాలు గలదు. ఆమె బాప్తిస్మము పొందక ముందు తన పిల్లలు ఇద్దరు చనిపోయిరి. ప్రభువును తెలిసికొన్న తర్వాత ఆయన ఆమెకు ప్రత్యక్షమై 'నీవు ఎందుకు ఏడ్చుచున్నావు, నీ పిల్లలు నా దగ్గర నున్నారు' అని చెప్పి వారిని తీసికొనివచ్చి చూపించిరి, 8) హిమాలయ పర్వతములలో ఉండి, లోకమంతటి నిమిత్తమై విజ్ఞాపన ప్రార్థనలు చేయుచున్న పన్నెండు వేలమంది క్రైస్తవ ఋషులున్నారనియు, వారిలో మనము ఎరిగిన కైలాస ఋషిగారును, సాధు సుందరసింగుగారును ఉన్నారనియు తెలిసినది. వారుకూడ బైబిలుమిషను మెంబర్లే. 9) మారుమనస్సు లేకుండా చనిపోయినవారు మోక్షమునకు వెళ్ళక పాతాళ లోకమునకు వెళ్ళుదురు. వారిలో ఎవరైనా మారుమనస్సు పొందిన యెడల మోక్షమునకు వెళ్ళుదురు. వారుకూడ బైబిలు మిషను మెంబర్లే.

19. ప్రశ్న:- మీరు బైబిలు మిషను స్థాపించినపుడు లూథరన్ మిషనువారు ఏమన్నారు?

జవాబు: 1) నాకు వచ్చిన దర్శనము కేవలము ఊహ దర్శనమని కొందరును, తప్పుడు దర్శనమని కొందరును, పిశాచి దర్శనమని కొందరును అనుకొన్నారు. 2) ప్రభువు దర్శనమే అని కొందరు అనుకొన్నారు. నమ్మినారు. కాని బైబిలు మిషనులోనికి రాలేకపోయినారు. 3) 'ఈ ఆలోచన యైనను ఈ కార్యమైనను మనుష్యులవలన కలిగినదాయెనా అది వ్యర్థమగును. దేవుని వలనకలిగినదాయెనా మీరు వారిని వ్యర్థపరచలేరు' అని ఒక మిషనెరీ మాత్రమే ఒక మిషను మీటింగులో తన అభిప్రాయమును తెలియపరచెను. (అపో.కార్య. 5:38-39) 4) మీరు లూథరన్ మిషనులోనే ఉండవలెను అని నాకు పరిశుద్ధాత్మ వలన తెలిసినది అని ఒక మిషనెరీ నాకు వ్రాసెను. మేము ఉండి బోధింతుమని అది వరకే మీటింగులో చెప్పితిమి. **కాని వారే ఉండనీయలేదు.** 5) మీరు బైబిలు మిషనువారి యెడల మృదువుగా ప్రవర్తించి మరల లూథరను మిషనులోనికి తీసికొని రండి అని అమెరికాలోలోని లూథరన్ బోర్డువారు, ఇండియాలోని మిషనెరీ వారికి వ్రాసిరి. కాని ఇది నెరవేరలేదు. 6) మీ దర్శనమును గురించి తీర్పు విధించుట నా పనికాదు అని ఒక మిషనెరీ నాకు వ్రాసెను.

20. ప్రశ్న:- మీరు బైబిలుమిషను పెట్టినప్పుడు మీ కారణములన్నియు ఎందుకు ప్రచురించలేదు?

జవాబు: ప్రచురించితిని. అప్పటినుండి నేటివరకు ఇతరులకు క్రైస్తవులకు ఉపయోగముగా నుండు పత్రికలు, పుస్తకములు ప్రచురించుచునే యున్నాను. కోట్లకొలది పత్రికలు కొన్ని పుస్తకములు వాటిలో సందర్భ వశమున బైబిలు మిషనును గురించి పేర్కొనుచున్నాను. వంద కీర్తనలు రచించినాను. నా పత్రికాదులు ఎవరైనా అచ్చువేయించుకొనవచ్చునని ప్రచురించినాను. బైబిలుమిషను

విషయములు అంగీకరించినవారు తమ తమ స్థలములలో బైబిలుమిషనును స్థాపించుకొనవచ్చును. దేవుని సందేశము ఆకాశమునకు, భూమికిని ఉద్దేశించినది. యెషయా 1:2; దా.కీర్తన. 148; మత్తయి 28:19; మార్కు 16:15,16; కార్య. 1:8; ఫిలిప్పీ. 2:10,11; ప్రకటన 5:13; ఈ వచనములు చదువగా దేవుని సందేశము పైలోకమునకును, భూలోకమునకును, పాతాళ లోకమునకును, అందినట్టు కనబడుచున్నది. మరియు దేవుని సందేశము బైబిలులోనున్నది. బైబిలుమిషనులోకూడ ఉన్నది. కనుక బైబిలుమిషను విషయములు మూడు లోకములలోను, మూడు కాలములలోను ఉన్నదని గ్రహించుకొనవచ్చును. (మూడు స్థలములలో, మూడు కాలములలో నున్నవారేగదా! మూడు లోకములలోను ఉన్నవారు) 'ఇది వ్రాయుచుండగా ఒకరికివచ్చిన దర్శనము: పరలోకమునందు ఒక మెరుపుతీగ బయలుదేరి భూమిమీదికి వచ్చి తిన్నగా పాతాళలోకమునకు వెళ్ళెను' 1పేతురు 4:6 "అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను'. ఫిలిప్పీ. 2:9-11. *చదువరీ!* బైబిలుమిషను *భూమిమీద నుండగనే నీవు దానిలో ప్రవేశించిన యెడల* పాతాళమునకు వెళ్ళక మోక్షమునకు వెళ్ళుదువు. ఒకవేళ బైబిలుమిషను సంగతి నీకు తెలియనియెడల మోక్షమునకు వెళ్ళినప్పుడైన తెలిసికొందువు. అక్కడ తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ, దేవదూతలు, భూలోకమునుండి వెళ్ళిన భక్తులు, పాతాళలోకము నుండి వెళ్లిన భక్తులు అనగా క్రైస్తవ సంఘము ఉన్నట్టును, ఈ సంగతులున్న బైబిలు

ఉన్నట్టును, ఈ విధముగా బైబిలుమిషను ఉన్నట్టును, ఈ, ఆ బైబిలుమిషనులో నీవు ఉన్నట్టును గ్రహించి బహుగా ఆనందింతువు.

21. ప్రశ్న:- బైబిలు మిషను ఏ విషయములో అన్ని మిషనులకంటె గొప్పదని కొందరు అడుగుచున్నారు?

జవాబు: అది మరలా చెప్పుచున్నాను.

1) దేవుడు స్వయముగా బైలుపరచినాడు గనుక 2) ఇన్ని సం॥ల నుండి బైలుపరుపక 1938లో అనగా మన కాలములో బైలుపడినది గనుక. 3) అనుకొనని నాకు బైలుపడినది గనుక. 4) అనుకొనని ఇండియాలో బైలుపడినది గనుక. *5) క్రైస్తవమత సంఘములోనుండి వేరైపోయి, చీలికయై ఆయా మిషనులుగా ఏర్పడిన మిషనులవలె ఇది ఏర్పడలేదు గనుక 6) నేను ఒక చీలిక మిషనులోనుండి వెలుపలికి వచ్చినాను గాని క్రైస్తవ మతములో నుండి వెలుపలికి వెళ్ళిపోలేదు. కాని దేవుని బైబిలు మిషనులోనికి వెళ్ళినాను. ఇది మనుష్యులు స్థాపించిన మిషనుకాదు. నేను స్థాపించిన మిషనుకాదు. దేవుడు బైలుపరచిన మిషను గనుక ఇది దేవునిమిషను.*

ఇది దేవుని మిషను గనుక అంతస్థులో అన్నిమిషనులకన్న గొప్పది. అంత మాత్రమున మెంబర్లు అందరు తక్కిన క్రైస్తవులందరికంటె గొప్పవారని చెప్పలేము. బైబిలుమిషనులో ఉండి ఆ మిషనుయొక్క ఏర్పాటును అనుసరించువారే అధికులు. మొదటి తరగతినుండి బి.ఏ. తరగతి వరకు ఉండునది విద్యయే. కాని ఆ విద్యలో అంతస్థులు గలవు గదా! అట్లే మంచి అంతస్థులు గల అన్ని మిషనుల అంతస్థుకన్న బైబిలుమిషనుయొక్క అంతస్థు గొప్పదిగాకపోతే దేవుడు ఎందుకు బైబిలు మిషనును బైలుపరచెను? మరియొక సంగతి : భక్తుల భక్తిలో అంతస్థులు గలవు గదా! ఒకరి భక్తికంటె ఒకరిభక్తి ఎక్కువగా కనబడుటలేదా! భక్తినిబట్టి అనగా విశ్వాసమునుబట్టి మనము భక్తులను తరగతులుగా

భావించుకొనవచ్చును. పంటనుబట్టి పొలములు ఏర్పడినవి. ఒక పొలము ముప్పదంతలు, ఒక పొలము అరువదంతలు, ఒక పొలము నూరంతలు అన్నియు పొలములే. కాని పొలములలో అంతస్థులు లేవా! పంటలలో అంతస్థులు అనగా ఎక్కువ తక్కువలు లేవా! అట్లే మిషనులన్నిటిలో అంతస్థులు ఉండవా? రక్షణ మోక్షప్రవేశము అను రెండు అంశములు ఈ సందర్భమున తలంపవలసినవికావు. తలంపవససినది అంతస్థు. మోక్షమునందు సంఘమునకు ఏడు తరగతులు అనగా ఏడు అంతస్థులు గలవు. (ప్రకటన 2,3అధ్యా) మొదటి అంతస్థునకు ఎఫెసు సంఘ అంతస్థు అని పేరు. మిగుల ఉన్నతమైన అంతస్థునకు లవొదికయ సంఘాంతస్థు అని పేరు. బైబిలు మిషనులో నున్న మెంబర్లు ఎవరైనను దేవుడు బైలుపరచుచు వచ్చిన సిద్ధాంతములనుబట్టి నడువని యెడల అట్టివారు బైబిలు మిషనులో బహిరంగమైన మెంబర్లైనను అంతరంగమైన మెంబర్లుకారు. మరియు 1938లో బైలుపడిన బైబిలు మిషనులోనుండి వెళ్ళిపోయినవారు చీలిక మిషనుకు సంబంధించినవారే గాని మొదటి బైబిలు మిషనుకు సంబంధించిన వారుకారు. వారికి రక్షణ లేదు అని చెప్పము కాని అంతస్థు లేదని చెప్పగలము. ఒక మిషనువారు ఒక మిషనువారిని దూషించిన యెడల, ద్వేషించిన యెడల అట్టివారు దేవునికి ఇష్టులు కారు. (మత్తయి 5:22-24). గద్దింపు వంకమీద దూషింపవచ్చునా? *మా దైవప్రత్యక్షత గ్రహింపనివారు నిశ్శబ్దముగా నుండుట మంచిది.* కాని చేయిపెట్టి కెలుకుట హాని. పరీక్షింపకుండను, దేవుని అడుగకుండను, అడిగి ఆయున చెప్పునది ఆలకించుటకు కనిపెట్టకుండను ఉన్నవారు ఎట్లు సత్యము తెలిసికొనగలరు? దూషింపగలరు కాని తెలిసికొనలేరు. ఒక విద్యార్థి అన్ని తరగతులలో నుండి బి.ఎ. తరగతిలోనికి వచ్చినప్పుడు తక్కిన తరగతులవారు సంతోషింపవలెనా, దూషింపవలెనా?

22.ప్రశ్న:– బైబిలు పండితులకంటెను, బైబిలు భక్తులకంటెను, మీరు ఎక్కువ తెలివిగలవారా! ఎక్కువ భక్తిగలవారా?

జవాబు: కాను. కనుకనే దేవుడు బైబిలు మిషనును బైలుపరచినాడని తలంచుచున్నాను. 'మీలో లోకరీతిని జ్ఞానులైనను, ఘనులైనను, గొప్ప వంశమువారైనను అనేకులు పిలువబడలేదు గాని ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండు వెర్రివారిని దేవుడు ఏర్పర్చుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పర్చుకొని యున్నాడు. ఎన్నికైనవారిని వ్యర్థముచేయుటకు లోకములో నీచులైనవారిని తృణీకరింపబడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పర్చుకొని యున్నాడు" (1కొరింథీ. 1:26-29) నేను మూడవ ఫారంవద్ద ఆగిపోయినాను. కాని బి.ఎ. తరగతివరకు వెళ్ళియుండిన యెడల ఈ బైబిలు మిషను ప్రత్యక్షత నాకు అందకుండునేమో! దేవుడు మోషేవంటి ఒక ప్రవక్తను త్వరలోనే లేపును అని ఒక పెంతెకొస్తు సంఘ బోధకుడైన పశ్చిమదేశ క్రైస్తవునికి బైలుపడెనట. ఆ ప్రవక్త ఇండియాలోనే ఉన్నాడట ఇది ఆయన ఏలూరులో చెప్పెను.

23. ప్రశ్న:- మీరు వస్తారని బైబిలులో ఎక్కడైనా ఉన్నదా?

జవాబు: మెతూషెలను అడగండి (ఆది 5:21) హిమాలయ పర్వతములలోనున్న కైలాస పర్వతమందు కైలాస ఋషి ఉన్నాడు. ఆయన యొద్ద క్రైస్తవ ఋషులు పన్నెండు వేలమంది ఉండి లోకము నిమిత్తమై ప్రార్థించుచున్నారు. సాధు సుందరసింగుగారుకూడ అక్కడనే ఉన్నారు. పైన ఉదహరించినవారును, బైబిలు మిషనులోనివారే. బైబిలు మిషనును ఇండియాలోనే ఎందుచేత? అది దేవుని చిత్తము. కొన్నియేండ్ల క్రిందట

బరంపురములో ఐదుగురు స్త్రీలు ఒక ప్రార్థనకూటము ఏర్పర్చుకొనిరి. ఆ కూటములోనికి ప్రభువును, తక్కినవారునువచ్చి మాట్లాడుచుండిరి. ఆ మాటలు వారు వ్రాసిపెట్టి ఉంచిరి. ప్రభువు అవి ముందునకు బైలుపరచును. నేనుకూడ అప్పుడప్పుడు వారి కూటమునకు వెళ్ళుచుంటిని. ఆ కూటమునకు క్రీస్తు నీతి సంఘమని పేరు. ఇదికూడ ఇండియాలోనిదే. వారు ఇప్పుడు పరలోకములో నున్నారు.

24. ప్రశ్న:- బైబిలు మిషను దేవుడు బైలుపరచిన మిషను అని నమ్ముటకు మాకు ఆధారమేమి?

జవాబు: దా.కీర్తన. 22:30,31. దీనిలో సూచన కనబడుచున్నది. బైబిలు కాలములోని భక్తులను మనము చూడలేదు. అయినను వారి విషయములు నమ్ముచున్నాము. బైబిలు మిషను బోధకులను అందరు చూచుచున్నారు. వారి బోధలు వినుచున్నారు, చదువుచున్నారు. చూడనివారి విషయములు నమ్మగలవారు చూచుచున్న వారి విషయములు ఎందుకు నమ్మకూడదు!

25. ప్రశ్న:- మారుమనస్సు విషయమై మీ యభిప్రాయమేమి?

జవాబు: 1) పాపస్థితిని మార్చుకొనుట మారుమనస్సు. 2) నూతన స్థితిని పొందుట మారుమనస్సు. ఈ రెండును కలిగియున్న వారికి మారు మనస్సు ఉన్నట్టు రుజువు. వివరము : దైవగ్రంథములో ఉదహరించిన పాపములు మానివేయవలెను. ఇదే మారుమనస్సునకు మొదటిమెట్టు. మరియు మనకు తెలిసిన తప్పులు అన్నియు మానివేయవలెను. మనము ఎవరియెడల అపరాధులమో వారియొద్ద తప్పులు ఒప్పుకొనవలెను. దేవుని యెదుట ఒప్పుకొనవలెను. బైబిలులోనున్న అన్ని విషయములు అంగీకరింపవలెను.

బైబిలు మిషను గురించి 2-4-57సం॥న ఒకరికి వచ్చిన దర్శనము:-

ప్రభువు కుర్చీమీద కూర్చుండి అయ్యగారిని ప్రక్కను కూర్చుండబెట్టి "సత్యాంశ నిరూపణ" అను పుస్తకమును చూపించుచు- "మధుర వాక్కులతోను, గంభీర వాక్కులతోను, ఆశ్చర్యము కలిగించు వాక్కులతోను వ్రాసినావు. నా సిలువను గ్రహించువాడే నన్ను గ్రహించును. నన్ను గ్రహించువాడే నా కుమారుని గ్రహించును. నా కుమారుని గ్రహించువాడే బైబిలు మిషనును, ఈ పుస్తకమును గ్రహించును" అని పలికిరి. మరియు ఆయన ఈ పుస్తకమును ఎత్తి చూపించుచు చెప్పినదేమనగా "ఇదిగో బైబిలుమిషనును ఎత్తిచూపించుచున్నాను, చూడండి".

మరియొకరికి ఈ పుస్తకమును గురించియే వచ్చిన దర్శనము: ప్రభువు చెప్పినదేమనగా : అందుకొన్న అయ్యకు అందినవాడను. అచ్చునందు అమర్చకుందునా? అందరకు అందించకుందునా? అందరిలోను ఆందోళన కలిగింపకుందునా? అందరును అసలు సంగతి అందుకొనకుందురా? పై విషయములన్నియు ప్రబలింప చేయుదును. ఆశీర్వదించి అందించిన అంశము అందరికిని ఆశీర్వాదకరమై యుండును. ఏలయనగా ఆశీర్వదించి అందించిన రొట్టెలు అందరికి ఆశీర్వాదకరముగా నుండెనుగదా!

**ముగింపు:-** 1) *ఈ పత్రిక కేవలము తెలుగు క్రైస్తవులకే కాదు ఇతర మిషనులవారును, ఇతర మతములవారును చదువుకొనవచ్చును.* 2) ఈ పత్రిక శ్రద్ధతో మంచి ఉద్దేశముతో చదువువారికి దేవుడు దివ్యజ్ఞానము ప్రసాదించును గాక! *3) బైబిలుమిషను దేవుని మిషను అని తెలిసికొని ప్రవేశించు వారిని దేవుడు కౌగలించుకొని*

చేర్చుకొనునుగాక! *4) బైబిలు మిషనును తమ స్థలములలోను, ఇతర స్థలములలోను స్థాపించువారికి దేవుడు జత పనివాడై నడిపించునుగాక!* 5) బైబిలుమిషను విషయములు అర్ధముకాని వారికి దేవుడు స్వప్నములోనైనా కనబడి నెమ్మదిగా బోధించును గాక! 6) బైబిలు మిషను విషయములు గ్రహించియు అంగీకరింపని వారికి దేవుడు స్వప్నములో కనబడి వారిని గద్దించునుగాక! 7) నాకు బైబిలు మిషను బైలుపడకపోయినను బైలుపడెనని చెప్పుచున్న యెడల నాకు తత్సంబంధమైన శిక్ష కలుగునుగాక! 8) బైబిలు మిషనును నేను వెల్లడిలోనికి తీసికొనివచ్చినందున నా స్వజనులు, స్నేహితులు, అధికారులు, ఇతర మిషనులవారు నాకు విరోధులైనారు. ఇప్పుడు ఇతర మతస్థులుకూడ కొందరు విరోధులైనారు. నాకు అవమానము కలిగినది. ఇట్లు జరుగునని నాకు ముందుగనే గ్రహింపైనది. అయినను వెల్లడించుటకు తెగించితిని. ప్రాణత్యాగము చేసిన క్రీస్తుయొక్క శిష్యులుకూడ ప్రాణత్యాగము చేయుటకు సిద్ధపడవలెనుగదా! “తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టు కొనును, నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని దక్కించుకొనును” మత్తయి 16:25.

గుంటూరు నందు:

ప్రథమ ముద్రణ 2008 ప్రతులు 5000

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

బైబిలు మిషను ప్రెస్ - పెదకాకాని, 522 509.

ఫోన్ : (0863) 2556149; 9949121777.